


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20 సంచిక: 12 హైదరాబాద్ 2021 ఏప్రిల్ పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** వార్షిక సభ్యత్వం : **రూ.100/-**

# అందుకే ఈ విన్నపం

మదిలో రేగెడి భావాలకి
ఏదో వొక రూపమివ్వాలని
ఆ భావ ఝరిలో సాగిపోక
కుసుమాంజలి సమర్పించాలని
దైవీమానవుడి జన్మదినాన వుంది
సంబరంగా, ఆడంబరంగా
ఈ ప్రపంచం దైవీస్వరూపుని
జన్మదిన వేడుక చేసుకొంటూంటే,
ఏదో తెలియని ఆవేదన,
నైరాశ్యం, ఒంటరితనం, పట్టిపీడుస్తున్నాయి నన్ను.
ఎందరో చుట్టుముట్టి తిరుగుతుంటె నన్ను
వారెవరూ నాకేమీ కాదనే భావన వెంటాడుతోంది నన్ను,
ఇంతమందిలో వొంటరి వాడినేనన్న
భావన ఎక్కువ అవుతోంది ఎందుకో తెలియదు నాకు
నీవు నా ఎదురుగా నిలబడినా
నా మనస్సు ఎటో పరుగిడుతోంది
ఎంత ప్రయత్నించినా నిలవడమేలేదు
కారణము అర్థం కావడం లేదు
నీవే దైవమని ఎంచుకొన్నా
నీదరినే నా సర్వస్వం సమర్పించాలనుకొన్నా
మరి ఇంతలో ఇంత మార్పులెలా తెస్తున్నావ్
చెదిరిపోక నీదరినే వుండే శక్తినీయి
అది నీ ధర్మం,
కాదు నీ కర్తవ్యం
అప్పుడే నీ నిజరూప దర్శనం సాధ్యం నాకు
నా ప్రేమాంజలి నీకర్పితం అప్పుడే
ఉన్నది నాకా నమ్మకం,
అందుకే ఈ విన్నపం

(1968 రెండవ దశకంలో వ్రాసిన రచన ఇది)

## బాబా సందేశం

**Do not seek Material pleasure and you will find the spiritual treasure.**

**నీవు భౌతిక ఆనందమును వాంఛించకు. ఆధ్యాత్మిక సంపదను పొందెదవు.**

**గౌరవ సంపాదకులు**
**డాక్టర్ మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

### మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. ఛగన్ మాస్టారు | 6-14 |
| 3. మెహెర్‌బాబా ట్రస్టు | 15-16 |
| 4. షాహాపురవాసి | 17-18 |
| 5. బాబాలో ఐక్యం | 19 |
| 6. లార్డ్ మెహెర్ | 20-27 |
| 7. నాకు నచ్చిన శీర్షిక | 28-29 |
| 8. మెహెరాబాద్ సహవాస్ | 30-33 |
| 10. మన్సారీ మాయి | 34-35 |
| 11. సద్గురువు - వేశ్య | 36-37 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# మెహెర్‌బాబా పత్రిక

## అరుదైన అవకాశం

మీ ప్రాంతాల్లో వున్న స్థానిక గ్రంథాలయ సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఆధ్యాత్మిక సంస్థలు, మెహెర్‌బాబా పత్రిక సభ్యత్వం తీసుకోవడానికి తగినంత ఆర్థికస్తోమత లేనివారు ఎవరైనా వుంటే అలాంటి వారి జాబితాలో అర్హత గల కొందరికి మెహెర్‌బాబా పత్రికను ఉచితంగా అందజేయాలని ప్రతిపాదించడమైనది. మెహెర్‌బాబా నామవ్యాప్తిలో భాగంగా, మెహెర్ సాహిత్యం పలువురికి అందజేయాలన్నదే ఈ ప్రతిపాదనలోని ప్రధాన ఉద్దేశ్యం. దయచేసి ఈ విషయమై స్థానిక బాబా ప్రేమికులు దృష్టి సారించి తగిన వివరాలను, వాట్సప్ నంబరు 99595 53218 త్వరలో పంపగలరు.

***

మెహెర్‌బాబా నామాన్ని ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యులుగా చేర్పించండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలను ప్రతి సంచికలోని పేజి 40 లోగా సవివరంగా తెలియజేయడమైంది లేదా మొబైల్ 99595-53218 సంప్రదించగలరు. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా ఠంచనుగా 26వ తేదీన పోస్ట్ చేస్తున్నాం. అంతకంటే ముందుగా అంటే ప్రతినెలా 20వ తేదీ కల్లా పత్రికను సిద్ధం చేసి ప్రింటింగ్ కోసం పంపుతూ, మెహెర్‌బాబా పత్రిక పేరిట ప్రారంభించిన వాట్సప్ గ్రూప్‌లో, అలాగే ఇ-మెయిల్ ద్వారా పోస్ట్ చేస్తున్నాం. ప్రింటింగ్ పూర్తయ్యాక సభ్యులందరికి ప్రతినెలా 26 తేదీన పోస్టు చేస్తున్నాం. పత్రిక మీ ఇంటికి 28వ తేదీలోగా తప్పక బట్వాడా అవుతుంది. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం మొబైల్ ఫోన్ నంబరు 99595 53218 యస్‌యంయస్ లేదా వాట్సప్ ద్వారా గానీ తెలియజేయవల్సింది.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీమతి పద్మ, వరంగల్ మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం 2021 ఏప్రిల్‌లో రూ 1,000/- విరాళంగా పంపారు. వీరికి మెహెర్‌బాబా పత్రిక పక్షాన ధన్యవాదములు. జైబాబా.**

# సంపాదకీయం నిజమైన ప్రేమ

అహ్మద్‌నగర్‌లోని వాడియా పార్కులో ప్రజాదర్శన కార్యక్రమం ముగిసింది. ఆ పిదప, 1954 సెప్టెంబరు 29న ముందుగా బాబా ప్రేమికులందరూ మెహెరాబాద్ మండలిహాలులో సమావేశమయ్యారు. ఆంధ్రా బృందం బాబాని కలిశారు. ఆ పిదప, హమీర్‌పూర్ వారి వంతు వచ్చింది. మీ పరిచయాలకు తెలుగువారు తీసుకున్నంత సమయం తీసుకోకుండా క్లుప్తంగా ముగించండి. మీరందరూ నాకు తెలియకపోతే కదా!! అన్నారు బాబా. హమీర్‌పూర్ నుండి వచ్చిన వారిని ఆ బృందం నాయకుడు శ్రీ కేశవ్ నారాయణ్ నిగం ఒక్కొక్కరిని బాబాకు పరిచయం చేశాడు. ముందుగా, సింగ్ అనే యువకుడ్ని పరిచయం చేశాడు. ఆతను బాబాతో కలిసి 1953లో ఆంధ్రా పర్యటనలో పాల్గొన్నాడు, అలాగే బాబా డెహ్రాడూన్‌లో వుండగా ఇంట్లో చెప్పకుండా బాబా దగ్గరకి వచ్చేశాడు. ఆతని బాగోగులు గురించి వాకబు చేశారు బాబా.
అనంతరం, బాబా ఆ యువకుడితో మాట్లాడుతూ "నిజమైన ప్రేమ అంటే ఏమిటో తెలుసా"? అని ప్రశ్నించారు. ఆపై బాబా ఇలా వివరణ ఇచ్చారు.
"నిజమైన ప్రేమికులకు లోలోపల ప్రేమ బడభాగ్ని చెలరేగుతున్నా, ఎదుటివారికి చూడ్డానికి కనీసం పొగ కూడా కనిపించదు. ఆ ప్రేమ జ్వాలలో వారు దహించుకుపోతున్నా బైటకు నవ్వుతూ ప్రశాంతంగా ఉల్లాసంగా కనిపిస్తారు. వారు బాబా నుండి దూరమయ్యామన్న ఎడబాటును కూడా ప్రశాంతంగా అనుభవిస్తారు. ఆ ఎడబాటులో ఎలాంటి నిట్టూర్పు వచ్చినా అది ఆ ప్రేమకే అవమానంగా భావిస్తారన్నారు".

***

"మీ విధులన్నింటికి సక్రమంగా హాజరుకండి. మీలోని మంచి-చెడు అన్నీ బాబాకు సమర్పించడం ద్వారా బాబాని ప్రేమించినవారౌతారు. మీరెలాగైతే మీ శరీరాన్ని దుస్తులతో కప్పి, రోజంతా మీ దుస్తుల గురించి మరచిపోతారో, అదేమాదిరిగా రోజుకొక్కమారు ఉదయాన్నే బాబా నామస్మరణ అనే దుస్తుల్ని మీ ఆత్మకు ధరించండి. ఆపై మీరు బాబాపై దృష్టిసారించకున్నా బాబా మీ వెంటనే వుంటాడన్నారు. బాబావారి మాటల్ని శ్రద్ధగా ఆలకించిన ఆ యువకుడు ఆచరణలో అమలు చేశాడని ఆనాటి రచనలు తెలియజేస్తున్నాయి. సింగ్‌జీ ధన్యుడు. (**లార్డ్ మెహెర్, పేజి. 3245**). ఆనాటి బాబా ఉవాచ నేటి తరానికి కూడా వర్తిస్తుంది.
ఆచరణలో అమలు చేయడానికి ప్రయత్నించుదాం!!

# శ్రీ సీతారాం దత్తాత్రేయ దేశ్‌ముఖ్

**(1908 -1972)**



Chhagan

ఈ పేరుని పాఠకులు ఎక్కువగా వినివుండరు. ఐతే, ఛగన్ మాస్టారు అంటే చాలామందికి తెలుసు. 1925వ సంవత్సరంలో హజ్రత్ బాబాజాన్ స్కూలులో టీచరుగా పనిచేశాడాయన. అందుకే ఛగన్ మాస్టారుగా ప్రతీతి. 1920వ దశకంలోనే ముక్కుపచ్చలారని 17 ఏండ్ల వయస్సులో అవతారుని పాదాలకు అంకితమయ్యాడు ఛగన్ మాస్టార్. అవతారుని సన్నిధిలో ఛగన్ మాస్టార్ అనుభవాలను తెలుసుకుందాం అనుకునేవారందరి కోసం, ఆయన గురించి ఈ శీర్షిక ద్వారా రేఖామాత్రం తెలియజేయాలనే ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి పరిశీలించండి. ఎన్నో అరుదైన అంశాలతో సంక్షిప్తంగా, సమగ్రంగా వున్న ఈ శీర్షికపై మీ అభిప్రాయాలను తెలియజేయగలరు.

***

అది 1925 ఏప్రిల్ నెల. మరో రెండు నెలలలో బాబా మౌనం ప్రారంభించారు. మెహెరాబాద్‌లో హజ్రత్ బాబాజాన్ స్కూలు ప్రారంభించిన తొలి రోజులవి. 1925 మార్చి 25న హజ్రత్ బాబాజాన్ స్కూలుని ప్రారంభించారు. 1925 ఏప్రిల్‌లో ఓ రోజున 17 సంవత్సరాల యువకుడైన సీతారాం దత్తాత్రేయ దేశ్‌ముఖ్ బాబా దర్శనార్థం మెహెరాబాద్‌కు వచ్చాడు. ఈతడినే బాబా ఛగన్ అని పిలిచేవారు. అహ్మద్‌నగర్ నగర శివార్లలోని భింగార్ టౌన్‌షిప్‌లో ఛగన్ వుండేవాడు. సాకోరిలోని ఉపాసనీ మహారాజ్ ఆశ్రమానికి తరచు వెళ్ళేవాడు. మహారాజ్ ప్రధాన శిష్యుడొకరు ఆరంగాంలో వుంటున్నాడని సాకోరీ బృందం చెబితే ఛగన్ ఆశ్చర్యపడ్డాడు. ఐతే, ఆరంగాంలో ఆయన్ని కలుసుకోవడానికి ఆయన ఇష్టపడలేదు. ఎందుకంటే తానొక స్తోత్రీయ బ్రాహ్మణుడు. వేదాలను ఒంటబట్టించుకున్నవాడు. మహారాజ్ శిష్యుడేమో పార్శీయుడు. జొరాష్ట్రియన్ మతస్తుడు. అందువల్ల ఈ పార్శీ గురువు దగ్గరకు ఛగన్ వెళ్ళడానికి చాలాకాలం ఇష్టపడలేదు. ఐతే, దురదృష్టవశాత్తూ ఒక సంఘటనలో వీరి యావదాస్తి పోగొట్టుకున్నారు. ఆ పిదప, ఓ రోజున బాబావారి దర్శనార్థం మెహెరాబాద్ వచ్చాడు ఛగన్. అలావచ్చిన ఛగన్‌ని బాబా ప్రేమగా పలకరించారు. దాంతో తన బాధనంతా మరచిపోయి సేదతీరినట్లైంది. ఏం కావాలని అడిగారు

బాబా. ఛగన్ తన ఆస్తిని కోల్పోయిన విషయాన్ని ఉన్నదిఉన్నట్లు చెప్పి, బాబా సహాయం అర్థించాడు. బాబా తనకంతా తెలుసు అన్నారు. బాధపడొద్దని ఓదార్చారు. పోగొట్టుకున్న ఆస్తిపాస్తులు అన్నీ క్రమేణా వశమౌతాయని అభయమిచ్చారు. ఆ తర్వాత ఛగన్ తండ్రి కూడా బాబా దగ్గరకు రావడం ప్రారంభించాడు. ఒక రోజున బాబా ఛగన్‌తో మాట్లాడుతూ, మెహెరాబాద్‌లోని హజ్రత్ బాబాజాన్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తావా? అని అడిగారు. "బాబా, నీ సేవ చేయడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా వుంటానన్నాడు. నీవు ఏ పని అప్పగిస్తే ఆ పనిని చేస్తానన్నాడు" ఛగన్. ఐతే నీవు మెహెరాబాద్‌లోనే వుండాల్సివస్తుంది. కాబట్టి, ముందుగా మీ తండ్రి అనుమతి తీసుకొని రమ్మనమన్నారు. అలా వచ్చి చేరిన ఛగన్‌కి మెహెరాశ్రమంలో వంటలు నచ్చలేదు. **"నేతి పోపులు లేని వంటలు"** అతగాడికి రుచించలేదు. మెహెరాబాద్ ఆశ్రమ తిండితో తన నాలిక రుచి ఎరగడం లేదని చెప్పి, ఓ రోజున తన స్వగ్రామం వెళ్ళిపోతానన్నాడు ఛగన్. బాబా అందుకు అంగీకరించారు. ఐతే, మీ తండ్రిని ఓసారి వచ్చి కలవమని చెప్పారు. బాబా అనుమతితో ఛగన్ తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయిన తర్వాత ఆయన తండ్రి వచ్చి బాబాని కలిశాడు. ఆయనతో బాబా ఏవో ఆధ్యాత్మిక అంశాలు ప్రస్తావించారు. ఆ పిదప, ఆయన ఇంటికి వెళ్ళి తన కొడుకుని మెహెరాబాద్‌కు తక్షణం వెళ్ళమని చెప్పాడు. అక్కడకి మాత్రం తాను వెళ్ళలేనని, అక్కడి తిండి తనకు ఏమాత్రం ఒంటబట్టడం లేదని గట్టిగానే చెప్పాడు ఛగన్. తండ్రి అందుకు ఒప్పుకోలేదు. ఛగన్ వెళ్ళి తీరాల్సిందేనని చెప్పాడు. ఛగన్‌ని తిరిగి పంపుతానని బాబాకి వాగ్దానం చేశానని, కాబట్టి దాని కోసం ఛగన్ వెంటనే వెళ్ళమని తండ్రి చెప్పడంతో, తండ్రిమాట శిరసావహించాల్సి వచ్చింది. అలా తిరిగి హజ్రత్ బాబాజాన్ స్కూల్‌లో అర్జున్ – విష్ణు మాస్టర్‌లకు సహాయకుడిగా చేరాడు. ఇదిలావుండగా, ఓ రోజున ఛగన్ తండ్రి సాకోరి వెళ్ళాడు. ఉపాసనీ మహరాజ్ ఛగన్ ఎలా వున్నాడని వాకబు చేశాడు. ఆరంగాంలో మెహెర్‌బాబాతో ఛగన్ వుంటున్నాడని చెప్పాడు. దాంతో ఉపాసనీ కోపంతో, ఏం చేశావయ్యా? నీవొక బ్రాహ్మణుడివి. నీ కొడుకుని ఓ పార్శీవాని దగ్గరకు పంపావా? ఆయనేమో అంటరానివారితో కలిసి కూర్చుంటాడు, వారితో భోజనం చేస్తాడు. నీ కులం భ్రష్టుపట్టింది పో! అంటూ, తక్షణం వెళ్ళి, నీ కొడుకుని ఆ ఆశ్రమం నుండి బైటకు తీసుకురా!! అని ఆదేశించారు మహరాజ్. ఛగన్ ఇష్టపడకపోతే, కాళ్ళూ చేతులూ కట్టి ఇంటికి లాక్కునిరా అని మహరాజ్ ఆదేశించాడు. నీవేం చేశావో నీకు తెలియడంలేదని మహరాజ్ తొందరపెట్టాడు. బ్రాహ్మణీకం మంట కలిసిపోతుంది. నీ కొడుకు పాడైపోతాడన్నారు. దాంతో, ఛగన్ తండ్రి తిన్నగా మెహెరాబాద్‌కి వచ్చి, బాబాని కలిసి, మహరాజ్ సంభాషణంతా చెప్పి, తన కొడుకుని తనతో

పంపివేయమని బాబాని కోరాడు. "మహారాజ్ ఏం చెప్పాడో అదంతా నిజం. ఛగన్ మీ కొడుకు. మీకు ఇష్టం లేకపోతే, ఆతడ్ని మీతో మీ ఇంటికి తీసుకెళ్ళవచ్చు. తనకేమాత్రం అభ్యంతరం లేదన్నారు" బాబా. ఇంతలో ఛగన్ కలగజేసుకుని, "తానుగా ఈ ఆశ్రమం వదిలి ఇంటికి వస్తే, మీరే బాబాకు వాగ్దానం చేశానని చెప్పి ఇక్కడకు తిరిగి తీసుకొచ్చారు. నేను ఆ వాగ్దానం మేరకు ఇక్కడ వుంటున్నాను. ఇప్పుడు ఈ సమయంలో ఆశ్రమాన్ని వదిలి, మీతో తిరిగి వెనక్కి రాలేనని స్పష్టంగా ఛగన్ తన తండ్రికి చెప్పడంతో, ఆయన అవాక్కయ్యాడు. అవతారుని ప్రేమ మధువు చవిచూసిన ఛగన్ మెహెరాబాద్‌ని వదిలి వెళ్ళడానికి సుతరామూ ఇష్టపడలేదు. చేసేదేమిలేక, సాకోరి వెళ్ళి, మహారాజ్‌కి ఈ విషయాలన్నీ చెబితే, నీ కొడుకు అక్కడే వుంటానంటే, బాధపడొద్దని అన్నారు. తానూ అంటరానివారితో కలిసిమెలిసి తిరుగుతానని, అంతమాత్రాన బ్రాహ్మణీకం అంటరానిదయ్యిందా? అని ఛగన్ తండ్రికి ఊరటకల్గింటే మాటలు చెప్పాడు మహారాజ్. సద్గురువుల మాటలు సామాన్యులకు అర్థంకావు సుమీ!! అలా 17 సంవత్సరాల వయస్సులో 1925 ఏప్రిల్ మాసంలో మెహెరాబాద్‌లో అవతారుని ఆశ్రమంలో చేరిన ఛగన్ మాస్టారు 1972 ఫిబ్రవరి 1న దేహత్యాగం చేసేదాకా అవతారుని సేవలో ప్రేమలో ఓలలాడాడు. అవతారుడు తన విశ్వకార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న ధన్యజీవి - ఛగన్. బాబా సమక్షంలో ఆయన అనుభవించిన అనుభూతులు చెప్పుకుంటూ పోతే ఓ ఉద్గ్రంథమే అవుతుంది. ముఖ్యమైన కొన్ని విషయాలను పరిశీలిద్దాం.

## ఆ పిదప రెండేళ్ళకు - అకోల్నర్‌కు ప్రయాణం

**1927 ఫిబ్రవరి 11, ఉదయం 5.30 కల్లా బాబా తన మండలివారితో కలిసి మెహెరాబాద్‌కు దగ్గర్లోనే వున్న అకోల్నర్ అనే గ్రామంలో ఛగన్ భార్య యొక్క చెల్లెలు - సుమతి వివాహానికి హాజరయ్యేందుకు కాలినడన బయల్దేరారు.** ఛగన్ కూడా బాబాతో పాటు వున్నాడు. తీరా వివాహ మండపం దగ్గరకు చేరాక, అక్కడివారు బాబాకు కనీసం కుర్చీ కూడా ఏర్పాటు చేయలేదు. బాబా అందరితో కలిసి ఆరుబయటనే కూర్చున్నారు. ఇక్కడ ఓ విషయం చెప్పాలి. స్థానిక గ్రామ ఆచారాల ప్రకారం ఛగన్‌కు చిన్నతనంలోనే శాంత అనే అమ్మాయితో పెద్దలు పెళ్ళి చేశారు. ఐతే ఆమె, అప్పటికింకా చిన్నపిల్ల కావడంతో ఆమెను కాపురానికి పంపలేదు. ఇప్పుడు ఆమె బంధువులు ఛగన్‌తో తీసుకెళ్ళమని ఒత్తిడి చేస్తున్నారు. నీకు భార్య అంటే ప్రేమ లేదా? అని అడుగుతున్నారు. ఆమెతో కలిసి వుండటం ఇష్టపడనివాడివి, ఎందుకు పెళ్ళి చేసుకున్నావ్? అని ప్రశ్నిస్తున్నారు. బాబాని చూపిస్తూ, ఇలాంటి సన్యాసుల వెంట తిరిగితే నీకేం లాభం? అని ప్రశ్నిస్తున్నారతడ్ని. ప్రస్తుతం ఛగన్

భార్య శాంత, తన తల్లితండ్రులతో వుంటోంది. ఎప్పుడైతే పెళ్ళికి వచ్చిన బాబాను వారు చూశారో, వారికి వెర్రెత్తి పోయింది. బాబాని వారు అనేకవిధాల దూషించారు. ఏ సద్గురువు ఇలాంటి ఆదేశాలు తన శిష్యులకి ఇవ్వలేదన్నారు. పెళ్ళైన భార్యా భర్తలను విడదీసే అధికారం నీకెవరిచ్చారని బాబాని ప్రశ్నించారు. నీవు సద్గురువు కాదు. నీవొక దొంగ సన్యాసివి అని గద్దించారు. పెళ్ళి తంతు జరిగినంత సేపూ, ఈ తీరున చాలామంది బాబాని దుర్భాషలాడారు. ఆ మాటల్ని బాబా ఖాతరు చేయలేదు. మౌనంగా ఆలకించారు. పెళ్ళి అయిపోగానే బాబా మెహెరాబాద్‌కు తిరుగు ముఖం పట్టారు. ఒక్కరు కూడా బాబాకు వీడ్కోలుగా రెండు చేతులూ జోడించలేదు. బాబాకు నమస్కరించలేదు. మరో ఆశ్చర్యం కలిగించే విషయం ఏమంటే, పెళ్ళి అయిపోయాక, ఛగన్ బాబా వెంట తిరిగి రాకుండా, పెళ్ళివారింట తన అత్తమామలతో వుండిపోయాడు. తిరుగు ప్రయాణంలో పెళ్ళివారి మాటల్ని ప్రస్తావిస్తూ, సద్గురువులకు ఇలాంటి అవమానాలు సర్వసాధారణం. ఈ మాటలు మాకు చెట్లపై పక్షుల కిలకిలరావాలు వంటివని కొట్టిపారేశారు. ఐతే ఛగన్ ప్రవర్తన పట్ల బాబా చాలా బాధపడ్డారు. ఆతను తనతో తిరిగి వచ్చివుండాల్సింది అన్నారు. బాబా ఇంకా ఇలా అన్నారు. ఆధ్యాత్మిక పథం గులాబీలు పరిచిన మెత్తని పరుపులాంటిది కాదన్నారు. ఇది చాలా కఠిన మార్గం. నీయొక్క నీడ నీకెంత దగ్గరగా వున్నా, దాన్ని నీవు తాక లేవు. నీవెంత తాకాలని ప్రయత్నిస్తే అది అంత ముందుకు వెడుతుంది. నీవు దాని వెంట నడవగల్గుతావ్ కానీ, దాన్ని నీవు వశపరచుకోలేవ్ అన్నారు. భగవంతుడు అలా కాదు. ఆయన నీతోనే వున్నాడు. నీలోనూ వున్నాడు. దేవుడు నీకెంత దగ్గరగా వున్నా నీవు ఆయన్ని తాకడం మాట అటుంచి, కనీసం ఆయనకేసి కూడా కన్నెత్తి చూడను కూడా చూడవు అని బాబా అన్నారు. బాబా ధాకే కేసి చూసి – టీ ఎక్కడ త్రాగుదాం అన్నారు. పెళ్ళివారింట ఏమి త్రాగలేదు, తినలేదు కదా!!. ఆ దారిన వస్తూ, ధాకే తనకు తెలిసిన వారింట్లో ఉదయం ఫలహారం, టీ ఇచ్చే ఏర్పాట్లు చేశాడు. బాబా సంతోషించారు. ఫలహారం ఇచ్చిన ఇంటి యజమానిని బాబా ఆశీర్వదించారు. ఉదయం 11 గంటలకల్లా మెహెరాబాద్‌కి చేరుకున్నారు. ఛగన్ ప్రవర్తన పట్ల బాబా బాధపడ్డారు. ఎలాగైనా తన శిష్యుడ్ని తన దరిచేర్చుకోవాలని నిశ్చయించారు. ఈ మేరకు మండలి సభ్యుడైన విష్ణు మాస్టర్‌ని ఛగన్ ఇంటికి వెళ్ళి, భోజనానంతరం ఛగన్‌ని తిరిగి మెహెరాబాద్‌కి రమ్మనమని కబురు పంపారు. ఛగన్ మంచివాడు. నిజాయితీపరుడు. ఇప్పటిదాకా తనను మనసారా ప్రేమతో అనుసరించాడు. ఆతనికి ఆధ్యాత్మిక పురోగతి కలిగించేలా నన్ను ప్రేరేపించాడని బాబా అన్నారు. ఐతే ఈ రోజు ఆతని ప్రవర్తన చికాకు తెప్పించిందన్నారు. ఛగన్ ఈ మాదిరిగా అక్కడే వుండటానికి కారణం ఆతని స్వార్థం ఏమాత్రం అయివుండదన్నారు.

బాబాని మరింతగా అక్కడివారు దూషించకుండా వుండేందుకు అక్కడ వుండివుంటాడని, కొందరు బాబా శిష్యులు అన్నారు. ఛగన్ భార్య శాంత మెహెరాబాద్‌లో వుండేందుకు తగిన వసతి ఏర్పాటు చేసినట్లు ఆమె తల్లితండ్రులకు విష్ణుతో కబురు పంపారు. ఐతే ప్రస్తుతం ఛగన్ ఒక్కడే రావాలని, ఓ పది రోజుల తర్వాత ఛగన్ వచ్చి ఆమెను కూడా మెహెరాబాద్‌కి తీసుకువస్తాడని, బాబా కబురు పంపారు. బాబా ఆ రోజు సాయంత్రం దాకా ఛగన్ కోసం వేచి వున్నారు. ఆతను ఎంతసేపటికీ రాకపోయేసరికి, ఆ రోజు సాయంత్రం అహ్మద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన రామచంద్ర గాడేకర్ వివాహానికి సాయంత్రం 7 గంటలకు బయల్దేరి వెళ్ళారు. అక్కడ బాబాను పూలమాలలతో ముంచెత్తారు. జరుగుతున్న వివాహాన్ని వదిలి, బాబా దర్శనం కోసం క్యూ కట్టారు. రుచికరమైన విందు ఏర్పాటు చేశారు. రామచంద్ర గాడేకర్ తండ్రి కస్బోబా గాడేకర్ బాబారాకతో అమితానందభరితుడయ్యాడు. తాను 1922లో ఇచ్చిన చెప్పుల్ని ధరించిన అవతారుడ్ని చూసి ఆతనెంతో ఆనందించాడు. అహ్మద్‌నగర్ వివాహం అయిపోయాక తిరిగి ఆ రోజు రాత్రి బాబా మెహెరాబాద్‌కి వచ్చారు. దారి పొడుగూతా బాబా తన శిష్యుడైన ఛగన్ గురించి మాట్లాడుతూనే వున్నారు. ఛగన్‌పట్ల బాబాకున్న ప్రేమను ఆ మాటలు వెల్లడించాయి. బాబావారి ఆదేశాల ప్రకారం ఛగన్ తిరిగి మెహెరాబాద్‌కి వచ్చాడు. ఐతే ఆతను తిన్నగా ఆరంగాంలో పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి, తన దుస్తులు అక్కడ వదిలి, కేవలం లంగోటాతో ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఆశ్రమానికి దూరంగా చిన్న ఎత్తైన కొండ ప్రాంతానికి వెళ్ళిపోయాడు. అక్కడున్న చెరువులో దూకుదామనుకున్న క్షణంలో ఆతని మనస్సులో ఎవరో మాట్లాడినట్లు, దాంతో సాధారణ స్పృహకి వచ్చి ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆతను చెప్పాడు. ఇంతలో ఛగన్‌ని మెహెరాబాద్‌కి వచ్చాడని తెలుసుకుని అతని కోసం వెదుక్కుంటూ వెళ్ళిన మండలివారు, ఆతడ్ని తీసుకుని ఆరంగాంలో తిరిగి దుస్తులు ఇప్పించి, రాత్రి 8 గంటల ప్రాంతంలో మెహెరాబాద్‌కి వచ్చారు. అహ్మద్‌నగర్ నుండి వచ్చిన బాబాకు ఈ విషయం తెలుసుకుని, ఛగన్‌ని తన గదికి పిలిపించారు. ఆతను చెప్పేదంతా ప్రశాంతంగా ఆలకించారు. తన భార్య శాంతతో మాట్లాడ్డం తప్పించి మరే తప్పు తాను చేయలేదని ఛగన్ బాబాతో చెప్పాడు. ఆమెని అలా వదిలిపెట్టినందుకు ఆమె తల్లితండ్రులు, బంధువులు నిష్ఠూరంగా మాట్లాడుతున్నారని చెప్పిందన్నాడు. ఆమె నాతో కలిసి వుంటానని, నా ఆధ్యాత్మిక మార్గానికి అడ్డురానని చెప్పింది. కుటుంబం, సంసారం గురించి తాను ఒత్తిడి చేయనంది. తను కూడా నాలాగనే, ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తానని చెప్పింది. బాబా ఏమి ఎరుగనట్లు సంతోషం అన్నారు. ఆ దరిమిలా, బాబా కొంగును విడవనని చెప్పి ఛగన్‌ని ప్రతిన చేయమన్నారు. బాబా పాదాలకు ప్రణమిల్లి కన్నీరు పెట్టుకున్నాడు ఛగన్. క్షమించమని

వేడుకున్నాడు. ధుని వెలిగించిన ప్రాంతంలో నుండి విభూతి తీసి ఛగన్ నుదిటన దిద్దారు బాబా. ఎన్ని అవమానాలు ఎదురైనా, తన శిష్యుడు తిరిగి ఆశ్రమానికి చేరాడు. అదే అవతారుడు ఆశించాడు.

## బాబా సేవకి అర్హత

1929 మే 10న బాబావారు మెహెరాబాద్ నుండి హరిద్వార్‌కి బయలుదేరారు. ఆలీ అక్బర్, బువాసాహెబ్, ఛాన్జీ, ఛగన్, పెసూ, మాసాజీ, గుస్తాద్‌జీ శ్రీవారి వెంట వున్నారు. మన్మాడ్ దాకా బస్సులో వెళ్ళి అక్కడ ఢిల్లీ – అలహాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఖాండ్వా దగ్గరపడ్తుంటే, ఓ చిన్న రైల్వేస్టేషన్‌లో రైలు ఆగింది. వస్తున్న రైలుని గమనించకుండా పట్టాలు దాటబోతుంటే ఓ వ్యక్తి రైలు క్రింద పడలేదు కానీ, రైలు వేగానికి పట్టాల ప్రక్కకి విసిరివేయబడ్డాడు. బాగా దెబ్బలు తగిలాయి. రైలు ఆగింది. జనం పోగయ్యారు. ఇది ఇలా వుంటే, బాబా ఛగన్ మాస్టార్‌ని పిలిచి ప్లాట్ ఫారమ్ పైన అన్నం దొరుకుతుందేమో చూడమన్నారు. అన్నంతో పాటు పప్పు కూడా పొట్లం కట్టించుకు రమ్మనమన్నారు. ఓ ప్రక్కన మనిషి క్రిందపడి చావుబతుకుల్లో గిలగిలా కొట్టుకుంటుంటే, బాబాకి అప్పుడే ఆకలి వేయ్యాలా అనిపించింది ఛగన్‌కి. అందరూ ఆ ఆక్సిడెంట్ చూడ్డానికి పరిగెడ్తుంటే, మా దేముడికి మాత్రం ఆకలి వేస్తోందనుకున్నాడు మనస్సులో. తినటానికి ఏదైనా పట్టుకురా అంటాడు. ఇదేమి చోద్యం. బాబా దయామయుడు అంటారే, ఏమాత్రం దయ లేకుండా వున్నాడే అనుకున్నాడు. ఇలాంటి ఆలోచనలతో వున్న ఛగన్, ప్లాట్‌ఫాంపై వున్న టీ స్టాల్‌లో అన్నం, పప్పు పొట్లాలు కట్టించాడు. ఫ్లాట్ ఫారమ్‌పై జనం బాగా వున్నారేమో, వాళ్ళని తప్పించుకొని రావడానికి కొంత టైం పట్టింది. ఎంతసేపటికీ ఛగన్ రాకపోతే బాబా చికాకు పడుతూ గుస్తాద్‌జీని వెదికి తీసుకురమ్మనమని పంపారు. ఇంతలో ఛగన్ రానే వచ్చాడు. ఎప్పుడనగా వెళ్ళావు. ఎప్పుడు వచ్చావ్ అని బాబా చివాట్లు పెట్టారు. ఆ రెండు పొట్లాలు ఇవ్వమన్నారు. వెంటనే ఆ పొట్లాలు విప్పారు. పప్పు, అన్నం కలిపారు. ఆత్రంగా తినసాగారు. ఏమయింది బాబావారికీవాళ అనుకొన్నాడు ఛగన్. ఫ్లాట్‌ఫారంపైన కొనఊపిరితో కొట్టుకుపోతున్నారొకరు. ఇక్కడ రైల్లో కడుపునిండా ఆరగిస్తున్నారు దైవత్వం మూర్తీభవించిన మరొకరు. విడ్డూరంగా కనిపించింది. ఛగన్ మనస్సులో మాట బాబావారికి తెలియకపోతే కదా! అందుకనే, ఏదో సణుక్కొంటున్నావే? ఆ మాట ఏదో పైకి చెప్పు అన్నారు. ఖంగుతిన్నాడు ఛగన్. అబ్బే, అదేమీలేదు బాబా! నేనేమీ అనుకోవటంలేదన్నాడు. అవతారునికి తెలియనిదేముంటుంది. ఆ గాయపడ్డ వాడికి ఏమవుతుందో అని తప్ప నీకు మరో ధ్యాసలేదు. నీ సానుభూతి వల్ల వాడికి ఏమీ ఒరగదు. నేను ఏదో పప్పు అన్నం

తింటున్నాననుకుంటున్నావ్. వాడికి నేనేమి చేస్తున్నానో నీకు తెలుసా? నేను తిన్న ప్రతి ముద్ద, నీవు జాలిపడుతున్న వాడి పొట్టలోకే వెడుతున్నాయి. అది నీ కళ్ళకు కనబడదు. సృష్టిలోని ప్రతి ప్రాణికీ శుభం చేసేది నేనే. అందరికీ మేలు చేసేది నేనే అన్న సంగతి సర్వదా గుర్తుంచుకో అన్నారు. నీ సానుభూతి ఎందుకూ పనికిరాదు అన్నారు. నా ఇచ్ఛనెరవేరాలంటే, నీ కోర్కెలని దహించి వేయాలన్నారు. నీ కోర్కెలు తగలబడి, బూడిదయితేనే తప్ప బాబాసేవకి అర్హుడవు కావని ఛగన్‌కి స్పష్టం చేశారు. బాబావారి మాటల్ని నోరు వ్రెళ్ళబెట్టి విన్నాడు ఛగన్. ఆ తర్వాత ఆ క్రింద పడ్డవాడిని చూసి రమ్మన్నారు. వెంటనే పెట్టె దిగి, జనం గుంపుగా వున్న వైపుకి వెళ్ళాడు. అక్కడి దృశ్యం నమ్మశక్యంగా లేదు. క్రిందపడ్డ వ్యక్తికి స్పృహ వచ్చింది. లేచి కూర్చొన్నాడు. టీ త్రాగుతున్నాడు. పెద్దగా దెబ్బలు తగల్లేదని అక్కడికి వచ్చిన డాక్టరు అంటున్నాడు. అంబులెన్సు వచ్చింది. ఆస్పత్రికి తీసుకువెడ్తాము. ఏదో చిన్న ఫ్రాక్చర్ అయింది. కట్టువేస్తే సర్దుకుపోతుంది అని డాక్టరు అంటుంటే, ఛగన్‌కి కళ్ళు తిరిగినంత పనయింది. ఓ అరగంట క్రిందట చూసిందేమిటి? ఇప్పుడు కనిపిస్తున్నదేమిటి? అంతా ఏదో మాయలా వుందనిపించింది. పొరపాటయింది. బాబావారినే శంకించాను అని మళ్ళీ లెంపలు వేసుకొన్నాడు మనస్సులోనే. అన్నం తెమ్మంటే బాబావారికి ఆకలివేస్తోంది అనుకొన్నాడు ఛగన్. బాబావారికి ఆకలి వేయటంలేదనీ తనకి ఓ గుణపాఠం నేర్పడానికే బాబావారు ఆకలి వేస్తోందన్నారని తెలీలేదు పాపం. తన కోర్కెలను ప్రక్కనపెట్టి అవతారుని ఇచ్ఛ ప్రకారం నడుచుకోవాలని ఛగన్‌కి మరోమారు తెలియజెప్పారు.

## తప్పిపోయిన కొడుకు

1930 ఏప్రిల్ 11. ఆ రోజున బాబా పంచగనిలో వున్నారు. బాబా ఛగన్‌ని పిలిచారు. ఈ చుట్టుప్రక్కల మంచి కుర్రాళ్ళు కనిపిస్తారేమో చూడు అన్నారు. 'వాయ్' అన్న ఊళ్లో, అక్కడ హోటల్లో పని చేస్తున్న కుర్రాడొకడు ఛగన్ కంటబడ్డాడు.వాడిని చూస్తూ బాబావారు సంతోషిస్తారనుకొన్నాడు. పంచగనికి తీసుకువెడతాను. నాతో వస్తావా? అని అతడ్ని అడిగాడు. ఈ విషయమేదో నా హోటలు యజమానిని అడగమన్నాడు ఆ కుర్రాడు. ఆయన వెళ్ళమంటే వస్తాను అన్నాడు ఆ కుర్రాడు. హోటలు యజమాని ఓ పట్టాన ఒప్పుకోలేదు. ఛగన్ తన పట్టువదల్లేదు. ఆ యజమానిని బ్రతిమిలాడి, బామాడి ఒప్పించాడు. బాబా దగ్గరకి తీసుకువచ్చాడా కుర్రాడిని. అతడ్ని చూస్తూనే బాబావారికి నచ్చాడు. కాసేపు ఆ పిల్లాడికేసి తేరిపార చూశారు. అంతే, అతగాడి కాలికి చిన్న దెబ్బ తగిలింది. పుండయింది, చూశావా అన్నారు. వెంటనే మెహెరాబాద్‌కి తీసుకువెళ్ళు, పాద్రీకి చూపించు. మంచి మందు

ఇమ్మని చెప్పు అన్నారు. గాయం మానాక పంచగనికి తీసుకురమ్మని పాద్రీకి చెప్పమన్నారు. బాబావారి మాటలు ఛగన్‌కు అర్థంకాలేదు. ఈ కుర్రాడికి తగిలింది పెద్ద గాయం కాదు. చాలా చిన్న దెబ్బ. ఇక్కడే పంచగనిలో ఎవరో ఒకరికి డాక్టర్‌కి చూపిస్తే మందు ఇస్తారు, తగ్గిపోతుంది. ఇంతదానికి మెహెరాబాద్‌కి వెళ్ళటం దండగపని అనుకొన్నాడు. కానీ ప్రభువు ఆజ్ఞ. ఏంచేస్తాడు. కిక్కురుమనకుండా, చిత్తం ప్రభూ అని మెహెరాబాద్‌కి బయల్దేరాడు. మెహెరాబాద్‌కి వెళ్ళాలంటే, పూణే వెళ్ళి బస్సు మారాలి. కాబట్టి పూణేలో సదాశివ పటేల్‌ని కలిసి వెళ్ళు, అతనికో చిన్న పని అప్పగించు అంటూ పటేల్‌కి ఏమి చెప్పాలో చెప్పారు. ఆ తర్వాత ఛగన్ మహాశయుడు ఆ కుర్రాడిని తీసుకొని బస్సు ఎక్కాడు. పూణేలో బస్సు దిగి, సదాశివ పటేల్ ఇంటికి బయలుదేరారు. అప్పుడో గమ్మత్తు జరిగింది. సదాశివ్ పటేల్ ఇంటి దగ్గర బావిలో నీళ్ళు చేదుతున్న ఓ ముస్లిం మహిళ, ఛగన్‌తో వున్న కుర్రాడిని చూసి పరుగున వచ్చింది. ఒరేయ్!! యూసుఫ్!! ఎక్కడికి పోయావురా నాయనా ఇన్నాళ్ళూ. కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారా నీ కోసం, అంటూ ఆ కుర్రాడిని వాటేసుకుంది. ఈ అమ్మని మరచి పోయావురా అంటూ కంట తడి పెట్టింది. జనం గుమ్మిగూడారు. వీడు ఈ అమ్మ కొడుకే. ఎవడో దుర్మార్గుడు, దుష్టుడు ఎత్తుకుపోయుంటాడు. ఈ తల్లి కన్నీరు మున్నీరయి ఏడుస్తోంది. ఇంతకాలానికి దేముడు దయదలిచాడు. కుర్రాడు తిరిగివచ్చాడు అని అంటూంటే, ఛగన్ బేజారెత్తాడు. ఏం చేయాలో పాలుపోక సదాశివ్ పటేల్ ఇంటికి వేగంగా వెళ్ళాడు. సదాశివ పటేల్ ఛగన్‌కి ధైర్యం చెప్పి, తల్లీ కొడుకులు దగ్గరకి వెళ్ళి ఏమయిందని అడిగాడు. యూసుఫ్ తప్పిపోయి అయిదేళ్ళు అయిందట. ఒక్కగానొక్క కొడుకంట. ఎంతగానో వెదికారట. దొరకలేదంట. దిగులుతో మంచం పట్టారుట. మళ్ళీ యూసఫ్‌ని చూస్తామనుకోలేదు. అల్లా దయవల్ల మా బిడ్డ దొరికాడీ వాళ అని మురిసిపోతున్నారు పిల్లాడి తల్లీ తండ్రి. సదాశివునికీ, ఛగన్‌కీ ఏంచేయాలో పాలుపోలేదు. పిల్లాడిని మెహెరాబాద్ తీసుకువెళ్ళమని బాబావారు ఆదేశించారు. అలా చేయకపోతే ప్రభువు ఆదేశాన్ని ధిక్కరించినట్లవుతుంది. పిల్లాడిని తీసుకుపోతే, తల్లీ తండ్రి తట్టుకోలేరు. ఈ ధర్మ సందేహాన్ని నువ్వే తీర్చాలయ్యా ప్రభూ అంటూ, సదాశివ్ పటేల్ బాబాకి టెలిగ్రామ్ పంపాడు. తిరుగు టపాలో జవాబు వచ్చింది. పిల్లాడిని వాళ్ళ అమ్మా, నాన్నల దగ్గరే వదిలేయండి. ఛగన్‌ని వాపసు రమ్మనమని ఆదేశించారు. ఛగన్ ఊపిరి తీసుకొన్నాడు. అప్పుడు అర్థమయింది ప్రభువు లీల. పిల్లవాడి గాయం పెద్దది కాదు. మెహెరాబాద్‌కి వెళ్ళాల్సిన పని లేదు. సదాశివునికి చెప్పాల్సిన కబురు ఏమంత గొప్పదీ కాదు. ఈవేళ కాకాపోతే రేపో, మరెప్పుడో అతని చెవిని వేయవచ్చా కబురు. తల్లీ బిడ్డల్ని కలపడానికే బాబావారు నన్ను పంపారు.

**ప్రభూ, నీ లీలలు అర్థంకావు ఎవ్వరికీ!** మీతో వుంటున్నామనే కానీ, ప్రతిరోజు కొత్తరోజే. కొత్త అనుభూతి, కొత్త అనుభవం మా సొంతం అంటూ ఛగన్ మెహెరీశు నికి అంజలి ఘటించాడు. ఇలా అవతారునితో సమక్షంలో సుమారు ఐదు దశాబ్దాలకు పైగా గడిపిన ఛగన్ మాస్టారు ధన్యుడు.

**ఈతరం యువత అందరికీ ప్రాత:స్మరణీయుడు.**

# మెహెర్‌బాబా కరీంనగర్ సెంటర్

YouTube CHANNEL

మెహెర్‌బాబా యూ ట్యూబ్ ఛానల్‌కు సభ్యులుగా చేరి ప్రోత్సహించవల్సిందిగా శ్రీ యన్. లక్ష్మీనరసింహారావు ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతస్థాయి ప్రమాణాలతో తాము కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తున్నామని ఆయన అన్నారు. అవతారుని భజనగీతాలు, లఘు నాటికలు, బాబావారి దివ్య చరిత్ర తెలుగు, హిందీ భాషలలో రూపొందించి ప్రసారం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మరాఠీలో కూడా రూపొందించామని అన్నారు. కరీంనగర్ నగర నడిబొడ్డున విశాలమైన భవన ప్రాంగణంలో అవతారుని కేంద్రాన్ని 1986 సెప్టెంబరులో ప్రారంభించామన్నారు. నేడు మెహెరాబాద్‌లో వుంటున్న శ్రీ హంసపాల్, శ్రీమతి ఇందిర బాబా కేంద్ర వ్యవస్థాపకులు. గత 35 సంవత్సరాలుగా ప్రతి గురువారం అవతారుని సత్సంగ్, ప్రత్యేక ప్రేమిక సహవాస్‌లను బాబా కేంద్రంలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం డిజిటల్ మీడియాలో భాగంగా, అవతారుని నామవ్యాప్తి కోసం, నిస్వార్థసేవా భావంతో పలు కార్యక్రమాలు రూపొందించ ప్రయత్నిస్తున్నామని, బాబా ప్రేమికులందరూ ప్రేమతో సహకరించాలని, సూచనలు అందజేయాలని, సభ్యత్వం స్వీకరించాలని శ్రీ లక్ష్మీనరసింహారావు **(8309 770328)** ఒక ప్రకటనలో కోరారు.

# మెహెర్‌బాబా ట్రస్ట్ ఆవిర్భావం




అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు 1959 ఏప్రిల్ 6న బాబా స్వయంగా ఏర్పాటు చేశారు. ఆ రోజున బాబా ఎగువ మెహెరాబాద్‌కు విచ్చేశారు. స్థానిక రిజిస్ట్రార్ దేశ్‌పాండే సమక్షంలో బాబా ట్రస్టు డీడ్‌ని రిజిస్టర్ చేయించారు. అప్పటికి బాబా వయస్సు 65 సంవత్సరాలు. మెహెరాబాద్‌లోని తన సమాధికి విచ్చేసే యాత్రీకుల సౌకర్యార్థం, తన సత్య ప్రేమ సందేశవ్యాప్తి, అవతారుని ఇచ్ఛ మేరకు చేపట్టాల్సిన పలు కార్యక్రమాలను నిస్వార్థసేవా బుద్ధితో, భగవంతుడైన బాబా ప్రేరణతో నిర్వహించాలనే లక్ష్యంతో ఆనాడు ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆనాడు బాబా ఎంపిక చేసిన పది మంది ట్రస్టు సభ్యులు బాబా సమక్షంలో వున్నారు. ఆ వివరాలు. 1).శ్రీ తాడిమేటి కుటుంబశాస్త్రి - చైర్మన్. **సభ్యులు** - 2). బాబా సోదరి మణి జా ఇరాని. 3). రంజూ 4). ఆది.కె.ఇరాని 5). మెహెర్‌జీ 6). నారిమన్ 7). పెండూ 8). విష్ణు 9). పాద్రి 10). కాకాబారియా

## ట్రస్టీగా ఏరుచ్

మండలి సభ్యుడైన ఏరుచ్‌ని ట్రస్టీగా వుండాలని బాబా ఎంపిక చేశారు.
ఐతే, ఏరుచ్ ఆ బాధ్యత నుండి తప్పించమని బాబాని వేడుకున్నారు.
ఆ పిదప ట్రస్టు చైర్మన్ నియామక విషయమై ఏరుచ్‌ని బాబా అడిగినప్పుడు, తెలుగువాడైన శ్రీ కుటుంబశాస్త్రి గారిని సూచించాడు.
బాబా వెంటనే అందుకు అంగీకరించారు. 1969లో బాబా భౌతిక దేహత్యాగం చేశాక, ట్రస్టు చైర్మన్ - ట్రస్టీల నడుమ న్యాయపరమైన కోర్టు వ్యవహారాలు తలెత్తాయి. 1973లో శ్రీ కుటుంబశాస్త్రి బాబాలో ఐక్యమయ్యారు. ఆ పిదప, బాబావారి సోదరి మణీజా ట్రస్టు చైర్మన్‌గా సుమారు రెండు దశాబ్దాలకుపైగా, అంటే, 1996లో ఆమె బాబాలో ఐక్యమయ్యే వరకూ ఎనలేని సేవలు అందజేశారు. అనంతరం, శ్రీ భావూ కల్చూరీని (భావూజీ) చైర్మన్‌గా ఎంపికయ్యారు.

ఆయన 2013 అక్టోబరు 13న బాబాలో ఐక్యమయ్యే వరకూ ట్రస్టు అభివృద్ధి పనులను తనదైన శైలిలో చేపట్టారు. ఆ పిదప, 2013 డిశెంబరు 15న, శ్రీ శ్రీధర్ కేల్కర్ బాబా ట్రస్టు చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఐతే, ఇకపై బాబా ట్రస్టు చైర్మన్ పదవీకాలాన్ని ఐదు సంవత్సరాలకు పరిమితం చేశారు. చైర్మన్‌గా పదవి చేపట్టిన నాటి నుండి ఐదు సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగుతారు. అనంతరం, ట్రస్టు సభ్యుల అందరి ఆమోదం మేరకు తిరిగి రెండవసారి ఎన్నుకునే అవకాశం వుంటుందని నిర్ణయించారు. నేడు మెహెరాబాద్‌కు విచ్చేసే ప్రేమికుల సంఖ్య భారీగా పెరగడంతో అనేక బృహత్తర కార్యక్రమాల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. మెహెరాబాద్ ఓ పెద్ద యాత్రాస్థలమౌతుందని, ఇక్కడ పెద్ద టౌన్‌షిప్ అభివృద్ధి చెందుతుందని అవతారుడు 1950వ దశకంలోనే ప్రకటించారు. బాబావారి ఉవాచ మేరకు మెహెరాబాద్ నేడొక మహా పుణ్యక్షేత్రంగా, భూకైలాస్‌గా మన కళ్ళ ఎదుట కనిపిస్తోంది. నిరంతరం బాబా సేవలో నిమగ్నమై వుండే ట్రస్టు సభ్యులు ధన్యులు.

### ప్రస్తుత ట్రస్టు సభ్యులు

1. ఆలి రమ్జూ.
2) మెహెర్‌నాథ్ కల్చూరి
3) ఫ్రంరోజ్ జె. మిస్త్రీ
4) రమేష్ జంగ్లే
5) డాలీ కేరేవాలా
6) అమ్రిత్ దారా ఇరాని
7). మెహెర్ ప్రసాద్ రాజు.

***

## నాకు నచ్చిన శీర్షిక

సీనియర్, సూపర్ సీనియర్ సిటిజెన్స్...తమకు నచ్చిన అవతారుని ప్రేమ సందేశంతో కూడిన ఏదేని శీర్షికను మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణార్థం పంపవల్సిందిగా కోరుతున్నాము. ఇందుకోసం మీరేమి ప్రత్యేకంగా కలంపట్టి రాయనవసరం లేదు. ఫోటో కాపీలు గట్రా తీయవల్సిన పనిలేదు. మీరు ఎంచుకున్న అంశాన్ని ఇంగ్లీషులో వుంటే దాన్ని తెలుగులో తర్జుమా కూడా చేయొద్దు. మీరు చేయవల్సిందల్లా....మీకు బాగా నచ్చిన, మీ మనస్సుని ఆకర్షించిన, మీరు చదివిన కథాంశాన్ని కేవలం ఫోటో తీసి మాకు వాట్సప్‌లో పంపండి. లార్డ్ మెహెర్ లాంటి గ్రంథాల్లో వున్న అంశాన్ని కూడా కేవలం ఫోటో తీసి వాట్సప్‌లో మాకు అందేలా పంపండి. వీలువెంబడి ప్రచురించి, మీతోపాటు మెహెర్‌బాబా పత్రిక పాఠకులందరితో మీకు నచ్చిన అంశాన్ని పాలుపంచుకుందాం!! ఇదే మా ఆశయం.

**మా వాట్సప్ నంబర్...995 955 3218.**

# బాబా ట్రస్టు నూతన సభ్యునిగా
# షాహాపురవాసి



2021 మార్చి 20, మెహెరాబాద్‌లో జరిగిన అవతార్ మెహెర్‌బాబా పిపిసి ట్రస్టు సమావేశంలో కాకినాడ పట్టణానికి సమీపంలోని షాహాపురవాసి శ్రీ యస్వీ మెహెర్ ప్రసాద రాజు గారిని ఎంపిక చేసినట్లు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ ప్రసాదరాజు మెహెరాబాద్‌లోనే స్థిరనివాసముంటూ అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. శ్రీ ప్రసాద్‌రాజు గారి తండ్రి శ్రీ అచ్యుత రామరాజు 1954లో అవతారుడిని తొలిసారిగా కాకినాడలో దర్శించుకున్నారు. 1955లో మెహెరాబాద్‌లో ఐదు రోజులపాటు ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్‌లో ఆయన పాల్గొన్నారు. ఆ పిదప గురుప్రసాద్, పూణేలో బాబా అనుమతించిన ప్రతి దర్శన కార్యక్రమానికి తప్పక హాజరయ్యారు. అవతారునిలో తన ఇలవేల్పుని దర్శించుకున్న శ్రీ రామరాజు గారికి 1964లో జన్మించిన కుమారుడి గురించి బాబాకు తెలియజేసినప్పుడు, “తన ప్రసాదంగా, మెహెర్ ప్రసాద్” అని పేరు పెట్టమని సూచించారు. మెహెర్‌బాబా ఆశీర్వదించిన కుటుంబంలో పుట్టిన ప్రసాద్‌రాజు నూతన ట్రస్టీగా నియమించినందుకు తెలుగువారందరూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

**జాల్ భాయ్ విధులు...** మెహెరాబాద్‌కు విచ్చేసే ప్రేమికులకు వసతి సౌకర్యం, మెహెరాబాద్‌లో ప్రతినిత్యం చేపట్టవల్సిన పనుల పర్యవేక్షణ వంటి బాధ్యతలు తనకు అప్పగించారని ప్రసాద్‌రాజు తెలిపారు. గతంలో ట్రస్టీగా వున్న జాల్ భాయ్ నిర్వహించిన పనులను తనకు అప్పగించినట్లు తెలిపారు. మెహెరాబాద్ కన్‌స్ట్రక్షన్ కమిటి సభ్యునిగా కూడా తనను నియమించారని ఆయన అన్నారు. మెహెరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ట్రస్టువారు అప్పగించిన పనులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, In His Name foundation పేరిట స్వచ్ఛందసంస్థను నెలకొల్పి, మెహెరాబాద్, అరంగాం చుట్టుప్రక్కల వున్న సుమారు 8 గ్రామాలలో వాన నీటి వినియోగం, భూగర్భజలాల అభివృద్ధి విషయమై అనేక కార్యక్రమాలు

గత కొన్నేళ్ళుగా చేపట్టినట్లు తెలిపారు. ఐతే, 2020 మార్చి నుండి కరోనా వైరస్ కారణంగా ఈ స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం కష్టమయ్యిందని అన్నారు.

## కరోనా ప్రభావం

ప్రస్తుతం మెహెరాబాద్‌లో కరోనా ప్రభావం ఆరంగాం, మెహెరాబాద్‌లలో తీవ్రంగా వుందని శ్రీ ప్రసాద్‌రాజు తెలిపారు. సుమారు రెండు వేలు గడప గల మెహెరాబాద్‌లో రమారమిన 300 కోవిడ్ కేసులు నమోదయినట్లు అంచనా అన్నారు.

ట్రస్టీగా నియమించినందుకు ధన్యవాదములు తెలియజేస్తూ, అవతారుని సేవ చేసుకునే భాగ్యం కల్పించిన బాబాకు వినయంగా, విధేయతతో ప్రణమిల్లుతున్నానన్నారు. ఇకపై తన శాశ్వత చిరునామా కేరాఫ్ మెహెరాబాద్, మహారాష్ట్ర అని అన్నారు.

***

# వాట్సప్ - 99595 53218

మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణార్థం మీరు పంపదల్చుకున్న సమాచారాన్ని వాట్సప్ నంబరు 99595 53218 ద్వారా పంపగలరు.

మీరు పంపుతున్న సమాచారంపై **"ప్రచురణార్థం"** అని ప్రత్యేకంగా పేర్కొనడం మరచిపోవద్దు. ప్రతినెలలో 10వ తేదీలోగా ఆయా సమాచారం మాకు అందేలాగా పంపవల్సింది.

మీ బంధు మిత్రుల్ని కూడా ఈ గ్రూపులో సభ్యులుగా చేర్పించండి!!

బాబా సమాచారాన్ని అందజేయండి. పత్రికను ప్రతినెలా 25వ తేదీన సికింద్రాబాద్‌లోని పోస్టాఫీసు వారికి అందజేస్తున్నాం.

కాగా, పత్రిక మీకు ప్రతినెలా 30వ తేదీలోగా బట్వాడా కావాల్సివస్తుంది. ఏ కారణంగానైనా పత్రిక అందని పక్షంలో మీ దగ్గరలోని పోస్టుమ్యాన్‌తో కాకుండా, ఫోస్టాఫీసులో ఫిర్యాదు చేయవల్సింది. కాగా పత్రికను ప్రతినెలా 18వ తేదీలోగా ఈ గ్రూపులో పోస్టు చేస్తున్నాం. దయచేసి పరిశీలించండి!!

## విన్నపం

**ఇటీవల** కొన్ని పత్రికలను పోస్టలుశాఖ వారు అడ్రస్సులోని వారు లేరని త్రిప్పిపంపుతున్నారు. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం తెలియజేయండి.

# అవతారునిలో ఐక్యమయ్యారు



### శ్రీ అన్నాఖండాలే

శ్రీ అన్నాఖండాలే, మెహెరాబాద్ స్వల్ప అస్వస్థతతో 2021 ఏప్రిల్ 10న బాబా నామస్మరణతో తుదిశ్వాస విడిచారు. మెహెరాబాద్‌లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 7 గంటలకు ప్రార్థనలు పూర్తవగానే తదుపరి భజన కార్యక్రమాన్ని నిర్వహించే ఖండాలే గారు బాబా ప్రేమికులందరికీ సుపరిచితులు. ఆయన రాసిన **"టియర్స్ ఆఫ్ జాయ్"** తదితర గ్రంధాలను ఈ తరానికి తన శాశ్వత కానుకగా అందజేశారు.



### శ్రీ వడ్డాది

శ్రీ వడ్డాది గోపాలరావు, విజయనగరం కేంద్రం 2021 ఏప్రిల్ 14న అవతారుని నామస్మరణతో తుదిశ్వాస విడిచారని కేంద్ర అధ్యక్షులు శ్రీ కొల్లి రామారావు తెలిపారు. బాబా కేంద్రానికి ఒక మూల స్తంభం వంటివాడు శ్రీ గోపాలరావు.ప్రతి నెలా మొదటి శుక్రవారం వారింట్లో బాబా సత్సంగ్ నిర్వహించేవారమని, బాబా ఎడల నిజాయితీ, విధేయతతో వున్న గోపాలరావు గారి మృతి తమకు తీరనిలోటు అని శ్రీ కొల్లి అన్నారు.



### డాక్టర్ కల్లూరి

ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు, డాక్టర్ కల్లూరి సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ ఏప్రిల్ 13న తుదిశ్వాస విడిచారు. ఎందరికో వైద్యసేవలు అందజేసిన నిరంతర భగవదారాధకుడాయన. మెహెర్‌బాబా పత్రికను ఆసాంతం ఆసక్తిగా చదివే పాఠకుడు. ఉగాది పండుగకు ముందు రోజున తీవ్ర గుండెపోటుతో దేవుని పాదాల చెంతకు చేరాడు. ఈయన డాక్టర్ మల్లాది శారద, హైదరాబాద్‌కు స్వయానా సోదరుడు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

**(గత సంచిక తరువాయి)**

ఆ మాటలు ఆమెకి బాగా హత్తుకొన్నాయి.
ఇప్పుడు, ఇదిగో, ఈ పరిచయంతో నమ్మకం కుదిరింది.
ఈ స్ఫురద్రూపి సాక్షాత్తూ మన ఏసుక్రీస్తు అనిపించింది.
అంతే, వెంటనే వెళ్ళి బాబావారి ప్రక్కనే కూర్చున్నది.
ఆవాళ్టి నుంచి ప్రతిరోజు బాబా వారిని దర్శించింది ప్రభువు లండన్‌లో వున్నన్ని రోజులూ. డెలియా చిన్న తమ్ముడు నాటక రచయిత. పేరు జాక్.
అక్క, తమ్ముడు కలిసి వో నాటకాల కంపెనీ పెట్టారు.
దాని పేరు క్యూ థియేటర్. ప్రయోగాత్మక నాటకాలు ప్రదర్శించాలన్నది వాళ్ళ సంకల్పం. ఇది ఏదో పెద్దస్థాయి ప్రయత్నమనుకొనేరు. అంత సీను లేదు. వూరు వచ్చిన కళాకారులు మాదిరిగానే వీరిద్దరూ వుడతా శక్తి కొత్త ప్రయోగాలు చేయాలని నడుం కట్టారుట. వాళ్ళ కార్యస్థానం - లండన్ నగరం. కళలకి కాణాచి. బ్రిటీషు రాజధాని కదా. బాబా వారి గురించి డెలియాకు చెప్పిన వాడు హెర్బర్ట్‌ట. అది ఎలాగ జరిగిందీ అంటే, 1931 వేసవిలో డెలియాని నిస్పృహ ఆవరించింది.
మనస్సు కకావికలమయింది. ఎందుకయిందీ అని అడగకండి.
ఆ వివరాల్ని చరిత్రకారుడు గోప్యంగా దాచాడు.
మనస్సు బాగోక పోవడంతో చల్లాకోంబ్‌లోని మెరిడిత్ స్టార్ ఆశ్రమానికి వచ్చింది.
మెరిడిత్ సంగతి తెలుసుగా పాఠకులకి.
ఆశ్రమానికి వచ్చిన వాళ్ళకి, నాలుగు మంచిమాటలు చెప్పేవాడు.
యోగ సాధన చేయించేవాడు. డెలియాకి ఆశ్రమం గాలి పడింది.
అప్పుడే వచ్చాడు హెర్బర్ట్. బాబావారిని అప్పటికి కలిశాడతడు.
అడిగినవాళ్ళకీ అడగనివాళ్ళకీ తన కొత్త బాబా గురించి చెప్తున్నాడు.
డెలియాకీ చెప్పాడు. నమ్ము - నమ్మకపో!
మెహెర్‌బాబా వంటి వ్యక్తిని నీవెప్పుడూ చూడలేదు.
వోసారి దర్శించు నీకే తెలుస్తుంది అన్నాడు.

హెర్బర్ట్ మాట నచ్చింది.
“తప్పకుండా కలుస్తా. నాకు కాస్తంత మనఃశాంతి దొరుకుతుంది అంటే,
యింకేమి కావాలి. మీ బాబారిని దర్శిస్తాను అన్నది.
ఇదిగో ఈవాళ సెప్టెంబరు 26వ తేదీ సాయంత్రం ‘తెల్లగుర్రం లాడ్జి’
నాటకం పేరు చెప్పి, మెహెరీశుని దర్శనం దొరికింది. జన్మ తరించింది.
ఆవాళ్టి నుంచి నా జీవితం మారిపోయింది అంటుందామె.
బాబావారిని తొలిసారి కలిసినప్పుడు ఏమనిపించింది?
ఆ మధురక్షణాలు గుర్తున్నాయా అని అడిగితే ఆమె ఏమంది అంటే,
నాకింకా గుర్తుంది ఆ క్షణం. మీకు తెలుసుగా బాబావారిని లండన్
నాటక ప్రదర్శనశాల కొలిసేయకులో కలిశాను.
మెహెర్‌బాబా వారి ప్రక్కనే కూర్చొన్నాను కానీ నా గురించి
అంతగా పట్టించుకో లేదు ప్రభువు.
అవతారుడని అందరూ కీర్తిస్తున్న వ్యక్తి ప్రక్కన కూర్చోవటం
వో అదృష్టం కానీ కాస్తంత భయం వేసింది.
కొంత సిగ్గు, మరికొంత జంకు నన్ను వుక్కిరి బిక్కిరి చేశాయి.
తలపై సుత్తితో కొడితే ఎలా వుంటుందో అలా వుంది నా స్థితి అనవచ్చును.
బాబావారు నన్ను పట్టించుకొన్నట్లు లేదు.
దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు.
బాబా వారిని చూస్తుంటే వో అద్భుతం చూస్తున్న భావన కలిగింది.
అలా చూస్తూ కూర్చుండి పోయాను. నిశ్చేష్ఠురాలినయ్యానంటే అతిశయోక్తి కాదు.
మెహెరీశుని చూడగానే నాకు గురి కుదిరింది.
ఈయన్నే ఆరాధించి తరించాలనిపించింది. ప్రభువుని ఏమీ అడగలేదు.
అసలు ఏ ప్రశ్న వేయలేదు. ప్రభువు కేసి చూస్తుంటే, చూస్తూ కూర్చొంటే,
చాలు అనిపించింది. ప్రభువు తప్ప మరెవరూ నాకు లేరనిపించింది అని అంటూ,
మెహెరుని నుంచి నేనేమీ ఆశించ లేదు.
మెహెరీశుని మనసావాచా నమ్మాను. ఆరాధించాను. ప్రేమించాను.
అలనాడు ఏసుప్రభువుని, ఆయన సన్నిహిత శిష్యులు ఎంతగా ఆరాధించారో,
ఎంతగా సేవించారో తెలుసుగా. అటువంటిదే.
మెహెరుని పట్ల నా ఆరాధన, నా ప్రేమ.
బాబావారి సేవకే నా జీవితం అంకితం చేశాను.
నా భగవదన్వేషణకి మెహెర్ దర్శనంతో తెరపడిందని,
మనసులో మాట చెప్పింది. డెలియా నటి.

విశ్వనాటక సూత్రధారి మెహెరీశుడు.
వీరిద్దరి పరిచయంతో నాటకం చూస్తున్నప్పుడు గమ్మత్తుగా లేదూ.
బహుశా మెహెరుని జగన్నాటకంలో డెలియాకి కూడా వో పాత్ర వుందేమో.
ఈ సంగతి ముమ్ముందు తెలుస్తుంది మనకి. బాబావారన్నారోమాట ఆమెతో.
ఏమని? నవ్వు యాధృచ్ఛికంగా రాలేదు నా దగ్గరకి అన్నారుట.
ఈ మాట నిజమే అనాలి.
లేకపోతే నాటకశాల దగ్గర ప్రభువు తారసపడడు.
మార్గరెట్, కిట్టీలలాగా డెలియా కూడా కారణజన్మురాలే.
అందుకనే, మెహెర్ సర్కిల్‌లో భాగమైంది.
మెహెరీశుని విశ్వనాటకంలో పాత్రధారి అయింది.
డెలియా చెల్లెలు, తమ్ముడు కూడా బాబా వారిని దర్శించారు.
ఆమె తల్లి కూడా ప్రభువు ఆశీస్సులు తీసుకొంది. డెలియాకి తండ్రి లేదు.
ఆయన చనిపోయి చాలాకాలమయింది.
అప్పటి నుంచి కుటుంబ పెద్ద డెలియానే.
ఆమె చెల్లెలి పేరు అమింటా టోలెడానో. వయస్సు 23 ఏళ్ళు.
అందరూ 'మింటా' అని పిలుస్తారు.
తమ్ముడి పేరు పాఠకులకి గుర్తుంది కదా!
అతగాడి పేరు జాక్. వయస్సు 28 ఏళ్ళు.
బాబా వారిని అమింటా కలిసింది
అక్క పేరు చెప్పి 'మెహెరీశుడిని దర్శిస్తావా', అని అక్క అడిగితే,
సందిగ్ధంలో పడింది.
"దర్శనానికి వెళ్ళాలా వద్దా అని గుంజిసలాడింది నా మనస్సు.
కానీ అక్క మాటకాదనలేక పోయాను".
మా అక్క సంగతి మీకు తెలుసుగా.
బాబావారిని నాటకం దగ్గర చూశాక, ఆయన సేవకే అంకితమైంది.
అందుకనే నాకో ప్రక్క వెళ్ళాలనిపించక పోయినా,
పోనీలే, పెద్దదాని మాట కాదనటం దేనికి అనిపించి,
దర్శనానికై కిట్టీ యింటికి వెళ్ళాను,
అన్నది డెలియా చెల్లెలు అమింటా గతాన్ని గుర్తుకుచేసుకొంటూ.
బాబావారి సమక్షంలో ఏమనిపించింది.
చెప్పాగా కిట్టీ యింటిలో వున్నారు బాబా అప్పుడు.
అక్కడికే తీసుకువెళ్ళింది అక్క. బాబావారి సమక్షంలో నిలబడ్డాను.

అక్క నన్ను పరిచయం చేస్తోంది.
ఇదిగో బాబా! నేను చెప్పా అమింటా గురించి.
ఈవాళ నాతో వచ్చింది అని అక్క అంటోంది.
ఆమె మాటలు వినిపిస్తున్నాయి. కాని నా దృష్టి బాబా వారిపైనే వుంది.
అక్క మాటలు ఎక్కడి నుంచో దూరాన్నుంచి వస్తున్నట్లున్నాయి.
బాబావారిని చూస్తుంటే, అలా చూస్తూ నిలబడాలి అనిపిస్తోంది.
నాలో బెరుకు, నా సందిగ్ధత అన్నీ ఎక్కడికి పోయాయో.
ధైర్యంగా ప్రభువు కేసే చూస్తున్నా. గుండెల్లో ఏదో దిగులు పట్టుకొంది.
గుండె పిసికేసినట్లువుతోంది.
నాకు తెలియకుండా కన్నీళ్ళు రావటం మొదలయింది.
ఎంత ఆపుకొన్నా ఆగటం లేదు వెక్కి వెక్కి ఏడుస్తున్నాను,
ఏమయింది నీకు? ఎందుకు కన్నీళ్ళు అని బాబా అడిగారు.
ఆయన మాట్లాడరు కదా అక్షర ఫలకంపై ఆయన వ్రేళ్ళు కదిలాయి.
శిష్యులెవరో అ మాటలు చదివి చెప్పారు.
శిష్యుడి మాటలు వినిపిస్తున్నాయి.
ఏమి చెప్పానో నాకు తెలియదు.
బాబావారు ఎంతో అందంగా వున్నారు.
ఆ అందానికి ముగ్ధురాలయి ఆనందాన్ని పట్టలేక యిలా ఏదో అన్నాను.
నా మాట నమ్మండి నమ్మకపోండి, ఆ క్షణం నుంచీ నా దొక్కటే కోరిక.
బాబావారిని అలా చూస్తూ వుండే అదృష్టం ఇస్తే చాలు.
ఎదురుగా చతికలపడి,
తదేకంగా అలా చూస్తూ వుంటే జన్మ తరిస్తుందనిపిచింది.
నాకింకేమీ అక్కర్లేదు.
ఈ ఒక్క వరం ప్రసాదించు ప్రభు అని వేడుకొన్నాను మనస్సులో.
మెహెరీశుని అందం మాటలకి అందదు.
ఏమి వర్చస్సు? దేవదేవుడాయన.
కోటి దీపాల కాంతిలో వెలిగిపోతున్నాడు. తెల్లని బట్టల్లో మెరిసిపోతున్నాడు.
జుట్టు ఎంత పొడుగ్గా వుందో. భలే బాగుంది కానీ నాకివేవి పట్టలేదు.
నా దృష్టిఅంతా మెహెరీశుని పైనే.
చుట్టుప్రక్కల ఏమవుతోందో నాకు పట్టలేదు.
అయినా మీరే చెప్పండి.
దేవదేవుడి ముందు కూర్చుంటే మనస్సు ఎక్కడికయినా పరుగెడ్తుందా చెప్పండి.

ఈ అదృష్టం ఇలా వుండిపోతే చాలనిపించదు.
అదే భావన కలిగింది నాకు ఆ వేళ అందామె. మరి మీ తమ్ముడు, అమ్మ కూడా బాబా వారిని దర్శించారు కదా. వాళ్ళ అనుభవం గురించి చెప్పండి అని అడిగితే, అమింటా పకాపకా నవ్వేసింది. "మా అమ్మకీ తమ్ముడికీ బాబా వారు నచ్చలేదు. వాళ్ళిద్దరూ కూడా నాతో పాటే బాబావారి దర్శనం చేసుకొన్నారు.
జాక్ బుర్ర పదునైనది. ప్రశ్నల పుట్ట. ఏ విషయమైనా మన బుర్రకి ఎక్కాలి. అర్థం కావాలి. అర్థం కావాలీ అంటే, ప్రశ్నలు వేయాలి. జవాబులు రాబట్టాలి. అవి అర్థం కావాలి. ఇదీ మా జాక్ ధోరణి.
బాబావారి సంగతి మీకు తెలుసుగా. బుద్ధికి, వివేకానికీ ఆమడ దూరంలో వుండండి. మనస్సుపెట్టి తెలుసుకోండి అంటారు ప్రభువు. అవును కదా.
అందుకనే మా జాక్ మెహెరీశుడుని చూస్తూనే పెదవి విరిచాడు.
అక్క! ఈ బాబాతో నా వల్ల కాదు అన్నాడు. నేను ఏమంటాను.
సరేరా! నీ యిష్టం అన్నాను. ఇహ మా అమ్మ అంటారా!
ఆమెకి బాబావారు అంటే అంతగా పట్టలేదు
మొదట్నుంచీ అంటీ ముట్టనట్టుగానే వుంది.
అక్క పేరు చెప్పి వచ్చింది తప్ప, ఏదో నమ్మకం,
గురి కుదిరి రాలేదు దర్శనానికి.
అందుకనే, దరిమిలా బాబావారి కార్యక్రమాల్లో పాల్గొనలేదు.
నా సంగతి అంటారా! చెప్పానుగా!
మొదటిసారి చూసినప్పుడే బాబావారు బాగా నచ్చారు.
నాపై చెరగని ముద్రవేశారు
మళ్ళీ మళ్ళీ దర్శనం చేసుకోవాలనిపించింది.
నా మనసులో మాట ప్రభువుకి వినిపించింది.
"రా! మళ్ళీ" అన్నారు.
ఇంతకంటే ఏమి కావాలి.
నాకు వీలుచిక్కిన ప్రతిసారీ బాబావారి దర్శనానికి వెళ్ళాను.
ప్రభువు ఆశీస్సులు తీసుకొన్నాను
ప్రతి దర్శనం వో మధురానుభూతి అంటూ,
తన కథ ముగించింది అమింటో.
కిట్టీ మేనకోడలు వర్జీనియా కూడా బాబావారిని చూసి
ఎదురుగా బుద్ధిగా కూర్చుంది.
ప్రభువు దగ్గరకి తీసుకొని ముద్దాడారు కూడా.

బాబావారికి అప్పట్లో బొద్దుగా మీసం వుండేది.
మీసం వెంట్రుకలు గుచ్చుకొన్నాయట.
అంతే అత్తకి ఫిర్యాదు చేసింది.
బాబావారు ముద్దు పెట్టుకొంటూంటే భలే సంతోషం వేసింది కానీ,
ఆయన గడ్డం గుచ్చుకొని నొప్పి పుడుతోంది, 'అన్నది ఆ చిన్నారి.
"తప్పు! అమ్మా! అలా అనగూడదు.
బాబా మన ఏసుప్రభువు, అని మేనత్త అంటూంటే,
వర్జీనియా అడ్డు తగిలింది.,
"అత్తయ్యా! మెహెర్‌బాబా! ఏసుప్రభువు అయితే ఏమిటి!
నాకాయన మీసం నచ్చలేదు.
నువ్వేమన్నా సరే," అన్నది.
కిట్టీకి నోటమాటరాలేదు. పట్టుమని ఎనిమిదేళ్ళులేవీ పిల్లకి.
అయినా యింత మొండితనమా?
తనకేమి తెలుసని ఇలా వాదిస్తోంది.
బాబావారికి ఈ సంగతి తెలిస్తే ఏమంటారో?
బాబాకి ఎలా తెలుస్తుంది. ఎవరో వొకరు చెప్పాలి కదా!
ఇంకొకళ్ళు చెపితే ఏమి బాగుంటుంది.
నేనే ప్రభువుకి చెప్తాను. వర్జీనియాని దండించమంటాను అనుకొన్నది కిట్టీ.
బాబావారు వొంటరిగా వున్నప్పుడు వర్జీనియా మీసం గొడవ చెప్పింది
ప్రభువు పకాపకానవ్వారు.
"ఎక్కడుంది వర్జీనియా! పిలిపించు," అన్నారు.
వర్జీనియా ముద్దు పేరు జెన్నీ.
ఆ పాప తమ సమక్షానికి రాగానే, బాబా వారేమన్నారో తెలుసా!

**బాబా :** ఏమి జిన్నీ! నా మీసం బాగాలేదా? నీకు నచ్చలేదా!

జిన్నీ : ఏమో బాబా!

**బాబా :** నా మీసం నచ్చలేదన్నావట కిట్టీ అత్తయ్యతో

**జిన్నీ :** అత్తకి చెప్పాననుకో బాబా మీసం గుచ్చుకొంటోంది.
ఏం చేయను మీరు ముద్దుపెట్టుకొన్నప్పుడు మీసం అడ్డం వస్తోంది.
గుచ్చు కొంటోంది. ఆమాటే అత్తకి చెప్పాను. బాబా అంటే నాకిష్టం.
కానీ బాబా మీసం నచ్చదు నాకు అన్నాను.

**బాబా :** అలాగా! నా మీసం గుచ్చుకొంటే, మా చిన్నారి జిన్నికి నెప్పి పుట్టదు!
మరి ఏం చేద్దాం, సరే! వో పనిచేస్తా! మీసం కొంచెం కత్తిరిస్తాను.

అప్పుడు ఎలా వుంటుందో చూద్దాం, ఏమంటావ్,

**జిన్నీ :** కొంచెమే, బాగా తగ్గించే బాబా. తన చిన్నారి భక్తురాలి కోరిక మేరకి మెహెరీశుడు మీసం బాగా కత్తిరించారు. భక్తుల మాట దేవదేవుడు ఏయుగంలో కాదన్నాడు కనుక. ఇప్పుడు ఈ అవతారకాలంలోనూ అంతే. ఆశ్రిత పక్షపాతుడన్న నామం సార్ధకమయింది ఇందువల్లనే. ప్రభువు మీసం కత్తిరించగా భలే బాగుంది బాబా అంటూ ఎగిరిగెంతులు వేసింది చిన్నారి.

పాపం బాబావారిని ముద్దులతో ముంచెత్తింది.

ఈ సంఘటన ఆమె మనస్సుపై చెరగని ముద్రవేసింది.

ఈమాటే అన్నది పెరిగి పెద్దయ్యాక, 1960 ప్రాంతంలో.

అప్పటికి ఆమె నలభయ్యో పడికి దగ్గర పడుతోంది.

“ముప్పయి ఏళ్ళ క్రిందటి మాట. ఇంకా ఇప్పటికీ బాగా గుర్తుంది.

అలా ఎదురుగా కూర్చో అన్నారు మెహెర్ ప్రభువు. ఎంతసేపు అన్నాను.

వొక్క నిముషం అన్నారు. కదలకుండా కూర్చో. నిమషంసేపు అన్నారు.

గడియారం పట్టుకొన్నారు. అంటే నేను కదలకుండా ఎంతసేపు వుంటానో

పరీక్ష అన్నమాట. నేను నోరు విప్ప కూడదట. మాట్లాడ వద్దు.

కదలకుండా కూర్చోవడం నా తరమా? భయం వేసింది.

నా వల్ల కాదనిపించింది. ప్రయత్నం చేస్తే పోలేదా అనుకొన్నాను.

ప్రభువు ఎదురుగా కూర్చున్నాను. ఎంతసేపు కూర్చొన్నానో నాకే తెలియదు.

మెహెరీశుని కేసి చూస్తూ కూర్చున్నాను.

అంతే! రెప్పలు వాల్చలేదు, పెదవి కదపలేదు. అలా కూర్చొన్నాను.

ప్రభువు ప్రసన్నుడయ్యాడు. నేను పరీక్షలో నెగ్గాను. నిముషం కాగానే, ఇహ చాలు ఈవాల్టికి. ఇంటికి వెళ్ళు అన్నారు మెహెరీశుడు. నాకు యింటికి వెళ్ళాలనిపించలేదు. అక్కడే అలా బాబావారి ఎదురుగా అలా కూర్చుండి పోవాలనిపించింది. బాబావారు వెళ్ళి పొమ్మనగానే ఏడుపు వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాను. ప్రభువు నాకేసి చూశారు. గుండె ఝుళ్ళుమంది. ఆ కళ్ళలో ఎంత దయ, ఎంత కనికరం. ఎందుకు పాపా! ఏడుస్తున్నావ్. నీతో నేను వున్నానుగా అన్న భావన, నన్ను కదిలించివేశాయి. ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్ళ ముందు కదులుతోంది. జన్మ జన్మలకీ మరచిపోలేను. ఆ చల్లని చూపు.

27వ తేదీ ఆదివారం (సెప్టెంబరు 1931) మధ్యాహ్నం – జిల్లా వచ్చింది.

ఈమె ఎవరో తెలుసా? జిన్ని అక్క. జిన్ని ఎవరూ? మన కిట్టీ మేనకోడలు.

చెల్లెలి తర్వాత వంతు అక్కకు వచ్చింది అన్నా అనవచ్చు.

ఆదివారం కదా! ఆమెకి స్కూలు లేదు. అందుకనే బాబావారి దగ్గర చాలాసేపు

వుంది. బాబా వారు మంచి మూడ్‌లో వున్నారు. నలుగురితో సరదాగా మాట్లాడారు. గ్రామఫోన్ రికార్డు వేస్తే పాటలు విన్నారు. పిల్లలతో పెద్దలతో ఆటలు. జిన్ని లాగే, జిల్లాకి కూడా బాబావారి దగ్గర వుండిపోదామనిపించిందట. ఆ మధ్యాహ్నం క్యూన్‌టిన్ వచ్చాడు. వో అరగంటసేపు బాబావారి దగ్గరే కూర్చొన్నాడు. ఈవాళ ఎవరినీ కొత్తవాళ్ళని కలవను, అని బాబావారు అన్నారు కానీ, కూన్‌టిన్ రాకకు అభ్యంతరం చెప్పలేదు. ఇతగాడు మెహెరీశుడిని ఆ మధ్యన కలిశాడు. 28వ తేదీ సోమవారం కిట్టీ తల్లి హెలీనాకి వో ధర్మ సందేహం వచ్చింది. మెహెరీశుడిని తన ఏసు ప్రభువుగా స్వీకరించి ఏసుని వో ప్రభువా!! అని కదా కీర్తించేది. మరి మెహెరుని అలా పిలవచ్చా! బాబా! ప్రభువా! అంటే ఎలా వుంటుంది అనిపించింది. మనసులో మాట ప్రభువుకి చెప్పింది. నేనవతారమూర్తిని అని నమ్మావు కదా! అలనాటి ఏసు యిలనాటి మెహెరీశుడనుకొంటున్నావ్ కదా! అది చాలదూ. నీ యిష్టం.
ఎలా పిలిచినా పిలువు అన్నారు చిరునవ్వుతో.
ఆ వృద్ధురాలి మనస్సు కుదుట పడింది.
మెహెరీశుడు ఏమంటారో అని గాభరాపడింది కదా మరి.
తాను చేస్తున్న అనాధల సేవ గురించి చెప్పింది.
తమ అనాధశ్రమాన్ని పావనం చేయమని వేడుకొంది.
“మాదొక స్వచ్ఛంద సంస్థ బాబా. నేను కార్యదర్శిని.
నిరుపేద అనాధల వృద్ధుల ఆశ్రమం నడుపుతున్నాను. యధాశక్తి సాయం చేస్తున్నాను ఆ నిర్భాగ్యులకి అని వివరించింది. బాబావారు శహభాష్ చెప్పారు.
మనస్సుపెట్టి నిరుపేదలు నిర్భాగ్యులను సేవించమన్నారు.

**హెలీనా:** మా వాళ్ళు మీ దర్శనం చేసుకో గలిగితే...

**బాబా :** దానిదేముంది. నన్ను దర్శిస్తే వాళ్ళకే మేలు.
నా ఆశీస్సులు అందుకొంటారు. ఆధ్యాత్మిక అవగాహన కల్గిస్తాను.

**హెలీనా:** కానీ బాబా వాళ్ళెవరూ ఇక్కడికి మీ దగ్గరకి రాలేరు.
వాళ్ళు నడవలేరు. కూర్చోలేరు. పెద్దవయస్సు వాళ్ళు కదా!!.
వాళ్ళ ఆరోగ్యం అంతంతమాత్రమే.

**బాబా :** వోహో! అలాగా! అయితే నేనే వస్తాను మీ ఆశ్రమానికి.

**హెలీనా:** అంతకంటేనా బాబా. మీరు వస్తాను అంటే మాకు పండగే!
కానీ బాబా! అక్కడ, అదే మా ఆశ్రమంలో కొందరు మూగవాళ్ళు.
ఇంకొందరు చెవిటివాళ్ళు. మరి మీరు చెప్పేది వాళ్ళ బుర్రకి ఎక్కుతుందా!
వాళ్ళకి విడమరిచి చెప్పటం కష్టమేమో!

**– సశేషం**

## నాకు నచ్చిన శీర్షిక

# ప్రేమ హి సార్ హై..,

**(శ్రీ నోరి సూర్యనారాయణ, కోఠి కేంద్రం)**



గురుప్రసాద్, పూణే. దర్శన సమయం.
1960 ఏప్రిల్ 10. ఆదివారం.
ఒక్కొక్కరే బాబాను దర్శించుకుంటున్నారు.
ఆ వరుసక్రమంలో బాబూరావ్ కాలే అనే ప్రేమికుడు బాబా దర్శనార్థం వచ్చాడు. అప్పట్లో బాబూరావ్ కాలే ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక సాధన చేస్తున్నాడు.
తాను ఓ పక్షిలా ఆకాశంలో ఎగురుతున్నట్లు కలగన్నట్లు బాబాకు చెప్పాడు. ఆధ్యాత్మికంగా దీనికేమైనా ప్రత్యేకత వుందా? అని బాబాని అడిగాడు. దానికేం ప్రత్యేక వుంటుంది. అది కేవలం ఓ కల మాత్రమే అన్నారు బాబా. పక్షులు ఆకాశంలో ఎగురుతుంటే మనం చూస్తుంటాం.
ఆధ్యాత్మికంగా దానికేం ప్రాముఖ్యత వుంది? అన్నారు.
పూర్వకాలంలో కొందరు యోగులు తమ తపోశక్తి వల్ల పక్షిలాగా ఎగరగలిగేవారు.
ఐతే, ఒక భగవత్ప్రేమికుడికి ఇలాంటివి అవసరం లేదన్నారు.
ఇలాంటి కలలు మీకెప్పుడైనా వచ్చాయా? అని ఎదుట కూర్చున్న ప్రేమికుల్ని, బాబా ప్రశ్నించారు. కొందరు తమ చేతులెత్తారు.
"కాబట్టి, ఇలాంటి కలలు రావడం అసాధారణం ఏమాత్రం కాదన్నారు బాబా".
ఆ రోజు బాబా ఎదుట కూర్చుని వున్న హమీర్‌పూర్ ప్రేమికుడైన పుకార్‌ని చూపిస్తూ, పూకార్‌లాంటి బలిష్ఠుడు కూడా కలలోనైతే గాలిలో తేలియాడతాడన్నారు.
అందులో ఆశ్చర్యం ఏముందన్నారు!! బాబా ఇంకా ఇలా అన్నారు.
నీవు గాలిలో ఎగిరినట్లు, లేదా నీళ్ళపై నడుస్తునట్లు కలలుగన్నా,
లేదా పూర్వకాలంలోని యోగులు మాదిరి తపోశక్తితో ఆకాశంలో ఎగిరినా,
దానికి ఆధ్యాత్మికంగా ఏమాత్రం ప్రాముఖ్యత లేదు.
దాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడమే ఉత్తమం అన్నారు.
**"నిజాయితీగా దేవుడ్ని ప్రేమించడానికి ప్రయత్నించు. తద్వారా ప్రేమ తప్ప మిగిలినదంతా వృధా"** అని నీవు తెలుసుకోగల్గుతావ్ అన్నారు బాబా.

నీవు ధ్యానం చేస్తావా? ఎవరిని ధ్యానిస్తావ్? అని బాబూరావ్‌ని బాబా అడిగారు.
భగవంతుడిని ధ్యానిస్తానని బాబూరావ్ జవాబిచ్చాడు.
దేవుడు ఎక్కడున్నాడు? అని బాబా ఆతడ్ని తిరిగి ప్రశ్నించారు.
దేవుడు అన్నింటా వున్నాడు. అందరిలో వున్నాడు. ధూళికణంలో వున్నాడు.
ధూళికి ఆవల కూడా వున్నాడని చెప్పాడు కాలే.
ఇదంతా కేవలం పుస్తక జ్ఞానం కాదా? అని ప్రశ్నించారు.
ఇది నీకు అనుభవపూర్వకంగా లభించిన జ్ఞానమా? అని అడిగారు.
చిన్ని పిల్లవాడు కూడా ఇలాంటి ప్రకటనలు చేయగలడు.
నీకు అనుభవంలో లేకుండా ఇలాంటి ప్రకటనలు చేయడం వృథా అని హెచ్చరించారు.
నీవు నిజంగా సత్యాన్వేషణలో వున్నట్లయితే, నీకు ఇష్టమైన భగవంతుడ్ని
ప్రేమతో మనసారా ధ్యానించడానికి ప్రయత్నించు.
ఈ సత్యాన్వేషణ మార్గంలో ఆ దేవదేవుని దర్శనం లభించడానికి ముందు,
నీకు అనేక అనుభవాలు – అనుభూతులు లభిస్తాయి.
ఇవన్నీ ఎంతో ఆకర్షణీయంగా, ఒక్కోమారు తప్పుదోవపట్టించేవిలా,
నీవు మోసపోయేలాగా కూడా వుంటాయి.
ఆకాశంలో పక్షిలా ఎగురుతున్నట్లు కలగంటేనే నీవు ఎంతగానో గర్వపడితే,
సత్యాన్వేషణలో అడుగడుగునా వచ్చే ఇలాంటి అనేక అనుభవాలతో
మరెంతగా గర్వపడాలో కదా? అన్నారు బాబా.
అడుగడుగునా తలెత్తే అహం గురించి అప్రమత్తతతో వుండాలి. లేదంటే,
అహంకారం దాని ప్రత్యేకతను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తూనే వుంటుంది.
ఐతే ఒక్కటి మాత్రం కచ్చితం.
ఈ అనుభవాలు – అనుభూతులకు మీరు ఎంతగా ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇస్తారో,
అంతగా మిమ్మల్ని ఆయా సంస్కారాల బంధనంలో చిక్కుకునేలా చేస్తాయి. కాబట్టి,
ఆయా అనుభవాల వెంబడి ఆకర్షితులు కావద్దు. దేవుని ఎడల అధిక ప్రేమతో
దృఢంగా వుండండని హితవు చెప్పారు బాబా.
సత్యాన్వేషణలో భగవంతుడిని మనసారా ప్రేమించడమే ప్రధానం.
మిగిలినవన్నీ అప్రధానం అని బాబా పలు సందర్భాలలో అనేక రీతుల
తన ప్రేమికులకు అర్థమయ్యేలా చెప్పారు.
అవతారుని ప్రవచనాలు ప్రతిఒక్కనికీ నిత్యస్మరణీయాలు.

***

**లార్డ్ మెహెర్, రివైజ్డ్ ఎడిషన్, 2017, పేజి 4656.**

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

బాబా ఆ సమావేశాన్ని ముగిస్తూ, సమయం చాలా తక్కువగా వుంది. కాబట్టి మీరు త్వరగా తేల్చుకోండి. వ్యక్తిగత సమావేశాలు కావాలా? లేదా గ్రూపుల వారీగా సమావేశమవుతారా? అని ప్రశ్నించారు. "గ్రూపు మీటింగులే" కావాలి బాబా అని అందరూ ముక్తకంఠంతో అన్నారు. దాంతో మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం ఐదు లేదా ఐదున్నర వరకూ గ్రూపు మీటింగులు ఏర్పాటు చేసుకుందాం అన్నారు బాబా. ప్రతి గ్రూపు వారు సుమారు 15 నిముషాలు నాతో గడపవచ్చని అన్నారు. ఐతే ఈ గ్రూపులు ఎన్ని వున్నాయి. ఏ గ్రూపులో ఎవరు వుండాలనేది ఎలా? అన్న ప్రశ్నకు, చాలామంది అనేక సలహాలు ఇచ్చారు. మొసలికంటి తిరుమల రావు గారు భాషా ప్రాతిపదికన గ్రూపులు ఏర్పాటు చేయడం సబబు అని సూచించారు. అదెలాగా అంటే 1). తెలుగు మాట్లాడేవారు. 2) గుజరాతీ మాట్లాడేవారు. 3) ఈ రెండు భాషలు కాకుండా ఇతర భాషలు, ఇంగ్లీషు అర్థం చేసుకునేవారు అని, మూడు భాగాలుగా చేస్తే బాగుంటుందని సూచించారు. బాబా వెంటనే తన అంగీకారం తెలియజేశారు. అలాగైతే ఒక్కొక్క గ్రూపువారికి సుమారు 30 నిముషాలు నుండి 45 నిముషాల దాకా సమయం కేటాయించవచ్చన్నారు. అందరికంటే అధిక సంఖ్యలో హాజరైన తెలుగువారితో ముందుగా మొదలెడదామన్నారు. తెలుగువారి సమావేశాన్ని సహవాస్ ప్రాంగణంలోనే ప్రారంభిద్దామన్నారు బాబా. ఇతరులందరికీ మెహెరాబాద్ మండలిహాలులో ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం తెలుగువారు, గుజరాతీవారు అవతారుని భజన గీతాలు ఆలాపించి, ఆరతి పట్టారు. ఆ పిదప అందరూ లంచ్‌కి వెళ్ళిరమ్మనమని ప్రకటిస్తూ, ఈ సమావేశంలో పాల్గొన్న పురుషులందరూ స్త్రీలకు ఎంతో రుణపడివున్నారని అన్నారు. ఎందుకంటే ఈ సహవాస్ స్త్రీల కోసం ఏర్పాటుచేసిందని బాబా గుర్తు చేశారు. ఇంకా చాలామంది స్త్రీలు రావల్సినవారు, వారి పిల్లల బాగోగులు, మరి ఇతర సమస్యల వల్ల రాలేకపోయారని అన్నారు. మగవారందరూ ఇంటిపట్టున వుండి, మీ పిల్లల్ని చూసుకుంటూ, మీ ఆడవాళ్ళని సహవాస్‌కి

**"ఆంధ్రులతో నా అనుబంధం ఈనాటిది కాదు". నా ఈ అవతారకాలంలోనే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రులతోనే కాదు, యావత్తు దక్షిణ భారతంతో నాకు అనాదిగా సంబంధం వుంది. చలోక్తిగా చెప్పడం లేదు. ఇది నిజం. ఆ కారణంగానే తెలుగువారు నన్ను అధికంగా ప్రేమిస్తున్నారన్నారు.**

పెద్దసంఖ్యలో వంవమని నేనెలా చెప్పగలనన్నారు. ఆ తర్వాత బాబా సహవాస్ టెంట్ నుండి దగ్గర్లోనే వున్న కిచెన్‌కి వెళ్ళారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు తెలుగు వంటవాళ్ళను బాబాకు పరిచయం చేశారు. ఈ రోజు మధ్యాహ్నం భోజనంలో ఏమి వండారని వాకబు చేస్తూ, అక్కడ శుచి – పరిశుభ్రత పరిశీలించారు. అలాగే ఆ ప్రక్కనే వున్న స్టోర్ రూంకి వెళ్ళి, ఆహారపదార్థాలు, కూరగాయల నిల్వలు పరిశీలించారు. ఆ మర్నాడు సహవాసీలందరి కోసమై ఛగన్ మాస్టారు లడ్డూలు తయ్యారుచేశాడు.బాబా ఓ లడ్డూని నోట్లో వేసుకుని రుచి చూశారు. పూణేలోని స్థానిక మరాఠీ దినపత్రిక అసిస్టెంట్ ఎడిటర్ శ్రీ కె.ఎన్. సోమన్ కిచెన్‌లో వంటవాళ్ళకి స్వచ్ఛందంగా సహాయం చేస్తున్నాడు. బాబా ఆతడ్ని చూసి, ఆతని సేవల్ని ప్రశంశించారు. ఆతను బాగా చదువుకున్నవాడు. ఎం.ఏ చదివాడు. ఐనప్పటికీ నా సేవలో భాగంగా, కిచెన్‌లో ఎంతో నిరాడంబరంగా పనిచేస్తున్నాడన్నారు. లంచ్ ముగించుకుని, సహవాసీల టెంట్‌కు వెళ్ళేముందు, ఆ దగ్గర్లో జరుగుతున్నదాన్ని చూస్తూ బాబా తన కేబిన్ దగ్గర నిల్చున్నారు. సహవాసీలలో ఒకరైన రావత్ ఆ దారిన వెళ్తూ వుంటే, బాబా ఆతడ్ని చూసి చలోక్తిగా ఇలా అన్నారు. "నీకు ప్ర్యూలూజని ఏల్చా నీ గురించి చెప్పాడన్నారు. ఇది నిజమేనా? అన్నారు. ఇప్పుడు నీ వయస్సు ఎంత? అని ప్రశ్నించారు. రావత్ ఉద్రేకంతో, "నీ పాదాలచెంత తనువు చాలించాలని వుంది బాబా" అదొక్కటే నా కోరిక అన్నాడు. ఐతే, నీ కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారన్నారు బాబా. వారందరినీ నీకే వదిలిపెడతానన్నాడు. అందుకు "థాంక్స్" అన్నారు బాబా క్లుప్తంగా. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 సమయంలో తెలుగువారితో సమావేశమయ్యేందుకు సహవాస్ ప్రాంగణానికి వెడుతూ విచ్చేసిన మహిళా సహవాసీల గది దగ్గర కొద్దిసేపు ఆగారు. దాంతో వారెంతో సంతోషించారు. అనంతరం సహవాస్ వేదికపైన వున్న తన ఆసనంలో కూర్చుని, తెలుగువారితో పిచ్చాపాటిగా మాట్లాడుకుందాం అన్నారు. ఏరుచ్‌కి క్షణం తీరిక లేకుండా వున్నాడన్నారు. లఘుశంకు కూడా తీరిక లేదతనికి. ఒకవేళ అలా వెళ్ళినా, సహవాసీలలో ఎవరో ఒకరు ఆతడ్ని చుట్టుముట్టడంతో ఓ గంటసేపటికిగాని తిరిగి రాలేక పోతున్నాడు. ఆతను మెహెరాబాద్‌లో నా దగ్గర రాత్రి కాపలాదారుడిగా

కూడా వుంటూ, ఇంకా ఎన్నో పనులు చక్కబెడుతున్నారన్నారు బాబా. ధనపతిరావ్ నాయుడు, కుటుంబశాస్త్రి, రంగారావు, మల్లిఖార్జునరావులను వేదికపైకి పిలిచి, ప్రతిఒక్కరిని మీ వయస్సు ఎంత అని ప్రశ్నించి, "ఆంధ్రులతో నా అనుబంధం ఈనాటిది కాదన్నారు". నా ఈ అవతారకాలంలో ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు.ఆంధ్రులతోనే కాదు, యావత్తు దక్షిణ భారతంతో తనకు అనాదిగా సంబంధం వుందన్నారు. ఇదేదో మిమ్మల్ని సంతోషపెట్టడానికో, లేదా చలోక్తిగా చెప్పడం లేదు. ఇది నిజం అని బాబా ప్రకటించారు. ఆ కారణంగానే తెలుగువారెందరో నన్ను అధికంగా ప్రేమిస్తున్నారని అన్నారు. ఆ పిదప బాబా నవ్వుతూ ఇలా అన్నారు. ఈ సహవాస్ ప్రత్యేకంగా స్త్రీల కోసం ఏర్పాటు చేసిందైనప్పటికీ, స్త్రీలను వెనకకు తోసివేసి, మగవారు చాలామంది ముందు వరుసలో వచ్చి కూర్చున్నారన్నారు. దాంతో మగవారు నవ్వుకుంటా లేచి వెనకకు వెళ్ళి, స్త్రీలకు ముందు వరుసలో కూర్చునే అవకాశం ఇచ్చారు. ఇలా చాలాసేపు సహవాస్ ప్రాంగణంలో బాబాతో ముచ్చట్లతో నవ్వులతో నిండిపోయింది. ఇక అట్టే టైం లేదని బాబా గుర్తుచేసేటప్పటికి అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. బాబా మాట్లాడుతూ –చూడండి. ఒక్కటి మాత్రం వాస్తవం. మీరు నన్ను ప్రేమించేదానికంటే నేను మిమ్మల్ని ఎంతో ఎక్కువగా ప్రేమిస్తున్నానన్నారు. నా ఎడల గల ప్రేమతో ఎంతో దూరం నుండి మీరిక్కడకు నా సహవాస్‌కోసం వచ్చారు. ఆంధ్రాలో మీరు చేస్తున్న ప్రతి కార్యక్రమం నాకు తెలుసు. వాటి గురించి నాకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ మాటకొస్తే మీరు చేపట్టబోయే పని గురించి, మీరు ఆలోచన చేయక ముందే నాకు ఆ కార్యక్రమం గురించి బాగా తెలుసు. నా నామవ్యాప్తిలో భాగంగా మీరు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, నాటికలు, నృత్యాలు, అనేక సాంస్కృతిక కార్యక్రమాల గురించి నాకు సంపూర్ణంగా తెలుసు. భగవంతుడికి అన్నీ తెలుసని మీరందరూ చెప్తారు. నన్ను భగవంతుని అవతారంగా మీరందరూ అంగీకరిస్తారు. నాకు అన్నీ తెలుసు. మీ గతం, వర్తమానం, భవిష్యత్తు నాకు తెరచిన పుస్తకమే!!. ఐతే భగవంతుడికి అన్నీ తెలుసు అంటే ఏమిటి? దాని అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఈ మాయామయ జగత్తులో నేనెలా నా కార్యక్రమాలు నిర్వహిస్తానో ఎవరికీ తెలియదు. మీరు చూస్తున్న ఈ మాయామయ జగత్తులో మీకు కాలం – దూరం అనేది వుంది. కానీ, నిజమైన సత్యమార్గంలో కాలం – దూరం అనే ప్రసక్తి వుండదు. జాగ్రత్తగా ఆలకించండి. నేడిక్కడ ప్రవచనం ఏమీ ఇవ్వకూడదనుకున్నా, ఇదేదో ఒక సందేశం అవుతోందంటూ, బాబా ఇంకా ఇలా చెప్పారు. నే చెబుతున్నా కదా, ఇంతవరకూ ఏమి జరుగలేదు. ఇకపై జరగడానికి ఏమీ లేదు. ప్రతీది ఇప్పుడే, ఈ క్షణంలోనే జరుగుతుంది. ఈ క్షణమే శాశ్వతమైనది. ఈ క్షణమే శాశ్వతంగా కొనసాగుతుంది. కాబట్టి ఆ మరునిముషం కూడా ఈ క్షణం

ఒక్కటే. కాబట్టి ఈ క్షణంలోనే గతకాలం, భవిష్యత్తు రెండూ నిక్షిప్తమై వున్నాయి. నీవు చిన్ని పిల్లవాడుగా వున్నావ్. ఆ తర్వాత పెరిగి పెద్దవాడవి అయ్యావ్. ఇదంతా, ఇన్ని సంవత్సరాలు కూడా ఇందాక నేను చెప్పిన క్షణంలోనే జరిగాయి. కేవలం మాయలోనే కాలం-దూరం వున్నాయి. సత్యంలో, యదార్థంలో కాలం -దూరం అనే బేధం లేదు. నా నిజస్థితిలో - ఈ క్షణమే వుంది. ఇది శాశ్వతం, నిత్యనూతనం. ఈ నిజస్థితిలో కొన్ని వేల సంవత్సరాల గతం- భవిష్యత్తు ఇమిడి వుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగిన సంగతులు నాకు తెలుసు. అలాగే, ఇప్పటి నుండి కొన్ని వేల సంవత్సరాల పిదప జరిగే అనేక విషయాలు గురించి నేను ఎరుగుదును. నేను మీ అందరిలో వున్నాను. నాకు అన్నీ తెలుసు. రేపు మీరు ఏమి ఆశిస్తారో కూడా నాకు తెలుసు. అందుకే మీరు నాకు ఏమీ చెప్పవల్సిన పనిలేదు. నీవెలా వున్నావని, నీవు ఏమనుకుంటున్నావ్?, ఏమి ఆలోచిస్తున్నావ్?, నీవు ఏం చేశావ్?, నా కోసం నీవు ఏమి చేయబోతున్నావ్? ఇవన్నీ నాకు కరతలామలకం. (కరతలము అంటే అరచేయ్యి. ఆమలకం అంటే ఉసిరికాయ. చేతిలో ఉసిరికాయ). నేను సర్వజ్ఞుడ్ని అయితే కనుక నాకు అన్నీ తెలిసే వుండాలిగా అన్నారు బాబా. కాబట్టి, అన్నింటికంటే మిన్నయైనది ఏమంటే నన్ను నిజాయితీగా ప్రేమించండి. నా నామవ్యాప్తికి కృషి చేయండి. మీరు చేసే ఈ పనిలో ఎలాంటి బేషజాలకు తావు ఇవ్వొద్దు. ఎవరి నుండి ఎలాంటి ప్రశంశలు ఆశించక నిజాయితీగా పనిచేయండి. మీరు నిజాయితీగా ప్రేమతో చేస్తున్న పనిపట్ల నేనెంతగానో సంతోషిస్తున్నాను. బాబా మనస్సు మారి ఏమన్నారో తెలుసా? మీలో ఎవరికైనా ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు నన్ను నవ్వించేలా, వాతావరణం తేలికపడేలా ఏదైనా చెప్పమన్నారు. ఈ మాట అందుకుని శ్రీ బందెల బాపిరాజు, ఏలూరు లేచి నిలబడ్డాడు. బాబా అయన్ని చూడగానే, ఈతను నన్ను నవ్విస్తాడు, అదే క్షణంలో కళ్ళంబడి నీళ్ళు తెప్పిస్తాడన్నారు. శ్రీ బాపిరాజు తనదైన ధోరణిలో తెలుగు-ఇంగ్లీషు కలగలిపి, ఎవరికి అర్థంకాని భాషలో గడిబిడా చెప్పి బాబానే కాదు, సహవాసీలు అందరూ కడుపుబ్బ నవ్వించాడు. ఆయన మాటలతో నవ్వు ఆపుకోలేని కొందరి సహవాసీల కళ్ళు చెమ్మగిల్లాయి. అనంతరం, శ్రీ బాపిరాజు పరమానందంతో వేదికపైనున్న బాబా దగ్గరకి వెళ్ళి అవతారుని దర్శన, ఆలింగనం అందుకున్నారు. సహవాసీలలోని ఒక పెద్దాయన లేచి తన కుమారుడు, అలాగే ఆయన స్నేహితులు సహవాస్‌కి రావాలనుకున్నా రాలేకపోయారని వారి వినమ్రపూర్వక నమస్సులు తెలియజేస్తున్నామన్నాడు. నేను అనంత ప్రేమ మహాసముద్రుడిని. ఇంకేమివ్వగలనన్నారు బాబా.

**-సశేషం**

మన్సారీ మాయి చెప్పిన యదార్థ సంఘటన.

# మాయ నుండి బయటపడటం ఎలా?



మన్సారీమాయి బాబా నామస్మరణ ఎంత ముఖ్యమో రకరకాల కథల ద్వారా చెపుతుండేది. వాస్తవానికి ఇది కథ కాదు. యదార్థ సంఘటన. ఆమె ఏం చెప్పిందంటే, స్త్రీ మండలి మెహెరాబాద్ కొండ మీద వుంటున్న రోజుల్లో టిన్ షెడ్‌లో వున్న గద్దె మీద బాబా కూర్చుంటే మేమందరం ఆయన చట్టూ కూర్చునేవాళ్ళం. ఒక రోజు బాబా మాట్లాడుతూ, ప్రపంచం అతిత్వరలో ఎదుర్కొబోతున్న బాధలు గురించి ఒకింత బాధగా చెప్పారు. ఆ సమయంలో అమెరికాకి చెందిన మార్గరెట్ క్రాస్కే, బాబా ఇది నువ్వు చేసిన తప్పు కాదా? అని అన్నది. నీవే కదా ఈ మాయని సృష్టించావ్. ఇప్పుడు మేమందరం ఆ మాయ వల్ల బాధపడుతున్నాం అన్నది. అంతేకాదు, మమ్మల్నందర్నీ నీవే ఈ మాయ నుంచి తప్పించ వచ్చును కదా!! అన్నది. అంతా నీ చేతుల్లోనే వుంది కదా!! అన్నది. బాబా గంభీరంగా ఇలా అన్నారు. “అవును, నేను ఆ పని చేయగలను. నేను ఎవరికైనా భగవత్ సాక్షాత్కారం ఇవ్వగలను. కానీ అది మీకే ఎందుకివ్వాలి. ఒక రాయికి ఎందుకివ్వకూడదు. నాకు మీరూ – రాయి సమానమే.

ఇద్దరిలోనూ నేనే వున్నాను. ముందుగా రాయికి ఎందుకు భగవత్‌సాక్షాత్కారం ఇవ్వకూడదు అన్నారు. నీకు భగవత్ సాక్షాత్కారం కావాలంటే, నన్ను ప్రసన్నం చేసుకుని, నా కృప పొందాలి. అది అంత సులభం కాదు. నాయందు ప్రేమ, సమర్పణ, విధేయత చూపితే నా కృప లభిస్తుంది. అయితే ఇందుకు ఒక సులభమైన మార్గం వుంది. నీవు నీ చివరి క్షణాలలో నన్ను తలచుకుంటే, నీకు ముక్తి లభిస్తుంది. ఇది కూడా చెప్పినంత సులభం కాదు. నీవు ఇప్పటి నుంచీ నా నామం సాధన చేస్తేనే, నీకు అది సాధ్యపడుతుంది. లేకపోతే చివరి క్షణాలల్లో నీ మనసంతా నీ కుటుంబం మీద, డబ్బు వ్యవహారాల మీద, ఇతర ప్రాపంచిక విషయాల మీద వుంటుంది. అందుకని ఇప్పటి నుంచే నా నామాన్ని స్మరించటం మొదలుపెట్టు అన్నారు బాబా. బాబా ఇంకా ఇలా అన్నారు. మీరెప్పుడన్నా కుక్కని కట్టేసినప్పుడు అది అసహనంగా మొరగటం గమనించ లేదా అన్నారు. అది ఎందుకు అలా మొరుగుతుంది. కుక్కల్ని బంధించినపుడు, అవి స్వేచ్ఛ కోసం పరితపిస్తాయి. కానీ ఇక్కడ కూర్చున్న మీ అందరూ అజ్ఞానమనే మాయలో బంధించబడి వుండి కూడా, అదే నిజమైన ఆనందంగా భావిస్తున్నారు. మీకెవరికీ అందులోంచి బయటపడాలని లేదు. ఒక మురికినీటి గుంటలో పురుగుల్ని బయటికి తీసినా, అవి తిరిగి ఆ మురికినీటిలోకి పాకేందుకే ప్రయత్నిస్తాయి. ఆ మాదిరిగా, నేను మీ మధ్యకు వచ్చిందే మిమ్మల్ని మాయ నుంచి తప్పించడానికి. మాయ నుండి విముక్తి చేయడానికే నేను వచ్చాను. మీరు మాయ నుండి బైటపడటానికి అతి సులభమైన మార్గం ఏమంటే నన్ను నిరంతరం మనస్ఫూర్తిగా స్మరించడమేనన్నారు. మన్నారీమాయి బాబా చెప్పిన ఈ మాటలు చెప్పి, మొదట్లో బాబాని రోజంతా స్మరించటం చాలా కష్టంగానే అనిపిస్తుంది. మీ మననసంతా మీరు చేయాల్సిన పనులపై లగ్నమైనప్పుడు బాబాను గుర్తుంచుకోవటం చాలా కష్టం కూడా. ఐతే, చిన్నపాటి ప్రయత్నం చేస్తే బాబాని చాలా సులభంగా గుర్తుచేసుకోవచ్చు. మీరు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న లంచ్, తిరిగి రాత్రి భోజనం మర్చిపోరు గదా! మీరు తినడానికి కూర్చునే ముందర లేదా ఆ తర్వాత బాబా నామాన్ని కొన్నిసార్లు స్మరించే ప్రయత్నం చేయండి. అలాగే మీరు నిద్రపోవటం, తెలవారగానే నిద్ర నుండి లేవడం మర్చిపోరు. ఆ సమయాలలో తిరిగి బాబాని స్మరించండి. ఈమాదిరిగా, నిరంతర బాబా నామస్మరణ క్రమేపీ మీకు అవలీలగా అలవాటవుతుందని, మన్నారీమాయి అనుభవపూర్వకంగా బాబా ప్రేమికులకు సలహా ఇచ్చింది. రైల్లో, బస్సులో మరి ఇతర మార్గాలలో ఎప్పుడైనా ప్రయాణం చేసేటప్పుడు, స్నానపానాదుల సమయంలో కూడా బాబా నామస్మరణ చేయడం అలవరుచుకోవల్సిందని ఆమె హితవు చెప్పింది. ఏదైనా "సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నారు. ఇంకెందుకు ఆచరణలో ప్రయత్నించుదాం!!.

నిస్వార్థ సేవ

# సద్గురువు - వేశ్య

మెహెర్‌బాబా తన ప్రేమికులకు ప్రధానంగా మూడు విషయాలు **1. ప్రేమ 2. విధేయత 3. సేవ** నిత్య జీవనంలో తు.చ.తప్పక ఆచరించాలని పలుమార్లు స్పష్టం చేశారు. ఆపదల్లో ఉన్నవారికి నిస్వార్థ సేవలందించమని, అలాగే ప్రతి ఫలాపేక్ష ఆశించవద్దని మెహెర్‌బాబా పలుమార్లు ఉద్బోదించారు. ఈ విషయాన్నే మెహెర్‌బాబా చెప్పిన ఒక కథాంశాన్ని బాబా మండలి సభ్యుడైన ఏరుచ్ ఇలా వివరించారు.

*****

అదొక మారుమూల చిన్న గ్రామం. ఆ గ్రామంలో ఆ ఏడాది వర్షాలు పడక దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు పండవు. బావులు ఎండి పోయాయి. త్రాగడానికి గుక్కెడు నీళ్ళు కరువయిన పరిస్థితి. ఈ స్థితిలో వారు చేయాల్సిన పూజలన్నీ చేశారు. ఒక మంచి వర్షం కురిపించమని దేవుడిని వేడుకోని రోజంటూ లేదు. ఇలాంటి పరిస్థితిలో చివరాఖరకన్నట్లు, వారి అంతిమ ప్రయత్నంగా గ్రామంలోని జనాభా అంతా గుంపుగా పట్టణంలో ఉంటున్న ఓ సద్గురువు దగ్గరకెళ్ళి తమ పరిస్థితి చెప్పుకుని ప్రాధేయపడ్డారు. అంతా విన్న ఆ సద్గురువు కూడా తానేమీ సహాయం చేయలేనని, ఇదంతా దైవీ ప్రణాళిక ప్రకారం జరుగుతోందని చెప్పాడు. తాను దైవ నిర్ణయాన్ని ఎదిరించలేనని తన అశక్తతను తెలియజేశాడు. అయ్యా, మీరే అలాగంటే మాకెవరు దిక్కని ఆ గ్రామీణులు రెండు చేతులూ జోడించారు. వాళ్ళ కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయి. సద్గురువు ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఈ సమస్యకు పరిష్కార మార్గంగా గ్రామస్థులతో ఫలానా గ్రామంలోని ఫలానా స్త్రీని కల్సి, ఆమెను భగవంతుడిని ప్రార్థించమని వేడుకోమని చెప్పాడు. ఆ పిదప, తగిన ఉపశమనం తప్పక లభిస్తుందని హామీ ఇచ్చాడు. దాంతో కొంతమంది గ్రామ పెద్దలు గురువు గారు చెప్పిన వ్యక్తి అడ్రస్సు వెదుక్కుంటూ ఆమె వుండే గ్రామానికి వెళ్ళారు. ఆమె ఎక్కడ వుండేది తెలుసుకునేందుకు వాకబు చేయగానే ఊర్లోని వారందరూ గ్రామ పెద్దలకేసి ఎగా దిగా చూశారు. అవహేళనగా మాట్లాడారు. ఆమెతో ఏం పని? అని ప్రశ్నించారు. మీకీ వయస్సులో ఇలాంటి పాడు ఆలోచనలా? అని ఎకసెక్కం చేశారు. ఆ తర్వాత తెలిసిన విషయం ఏమంటే, ఆ ఊర్లో ఆమె ఒక వేశ్యవాటికలో వుంటుంది. ఆమె కూడా ఒక పేరెన్నికగన్న వేశ్య. మరి సద్గురువు అలాంటి ఆమె దగ్గరకి తమని వెళ్ళమని ఎలా వెళ్ళమన్నాడా అని ఆ పెద్దలు ఒక్క క్షణం ఆలోచనలోపడ్డారు. ఏదిఏమైనా సద్గురువు చెప్పినట్లే చేయాలని నిర్ణయించుకుని,

ఆమె దగ్గరకెళ్ళి, వారు వచ్చిన విషయమంతా ఆమెతో చెప్పారు. వారి మాటలు విని, ఆమె కూడా అవాక్కయింది. తానొక వేశ్యనని, కులటనని చెప్పింది.
నా ప్రార్ధనలు భగవంతుడు ఆలకిస్తాడా? అని తిరిగి పెద్దలను ప్రశ్నించింది.
ఐనా, ప్రయత్నంలో తప్పు ఏముందని దేవుడిని ప్రార్ధించేందుకు ఆమె కళ్ళు మూసుకున్న కొద్ది క్షణాల్లోనే, ఆకాశం మేఘావృతమౌతుంది. కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఊహించని రీతిలో తమ ప్రాంతంలో పెద్ద వర్షంతో కుంటలన్నీ జలమయమయ్యాయి. తన ప్రార్ధనకి ఇంత మహిమ ఎలా సాధ్యమయ్యిందో తెలుసుకోవాలనే ఉత్సుకతతో, ఆమె కూడా నేరుగా సద్గురువు దగ్గరకెళ్ళింది.

## ఒక్క మంచిపని

ఆమె చేసిన ఒక్కగానొక్క మంచిపని, ఈనాడు యావత్తు గ్రామాన్ని కరువు బారినుండి రక్షించిందని, ఎందరికో జీవనం చూపిందని సద్గురువు చెప్పాడు. ఆమె చేసిన మంచి పని ఏమిటో కూడా వివరిస్తూ, నీవు మంచి యవ్వనంలో, అందంగా వున్న రోజుల్లో, ఓ విటుడు బంగారం నగలు బహుమతిగా ఇస్తానని చెప్పగానే అతడిని కలుసుకొనేందుకు పరుగు పరుగున ఉత్సాహంగా నీవు ఊర్లోంచి వెళ్తున్నావు. అలా నీవు వెళ్తున్న దారిలో, ఒక ఆసామి ఇంటి సావిడిలో గుంజకు కట్టిన లేగ దూడ దగ్గర్లోనే వున్న దాని మేతను అందుకోలేక, ఆకలితో అలమటిస్తూ **అంబా** అని కేకలు పెడ్తోంది. దూడ మెడకు కట్టిన పొడవాటి తాడు, దూడ కాలి క్రింద మెలికపడి, దాని మేతను అందుకోలేకపోతుంది. ఆసామి ఇంట్లో ఎవరూ లేరు.
దూడ చేసే ఆర్తనాదాలు ఆలకించేవారు ఎవరూ లేరు. ఆ సమయంలో నీవు ఆ దారినే వెళ్తూ, దూడకి దగ్గరగా దాని ఆహారాన్ని నీ ఎడమ కాలితో తన్ని, నీ దారిన నీవు వేగంగా వెళ్ళిపోయావు. దూడ ఆకలి తీరింది. ఆ రోజు దూడకు నీవు చేసిన సహాయం చాలా మహత్తరమైందని సద్గురువు అన్నాడు. ఆ మాట నిజమే కానీ, నేను చేసింది సహాయమనీ, అదొక గొప్ప సేవనీ నేను భావించ లేదు. సరికదా, ఆనాడు నేనేం చేశానో కూడా ఈనాటి దాకా, మీరు నాతో చెప్పేదాకా, నాకస్సలు గుర్తులేదని వేశ్య జవాబిచ్చింది. సద్గురువు నవ్వుతూ, నీవు చేసిన సేవ ప్రతిఫలాపేక్ష లేనిది. నిస్వార్ధమైంది. చేసిన మంచి పనిని కూడా మరచి పోయావు. అందుకే భగవంతుని మెప్పు పొందగల్గావు అని సద్గురువు స్పష్టం చేశాడు.
ఇతరులకు చేసే ఎటువంటి సహాయన్నైనా నిస్వార్థంగా చేయాలి. ప్రతిఫలాపేక్ష ఉండరాదు. అదే భగవంతునికి ప్రీతి అని మెహెర్‌బాబా పేర్కొన్నారని ఏరుచ్ చెప్పడం ముగించాడు. అదే నిస్వార్ధసేవకి నిర్వచనమని చెప్పకనే చెప్పారు బాబా.

*****

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!
నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2021 మార్చిలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | శ్రీ వి. శ్రీకుమార్, శ్రీకాకుళం | రు. 1000/- |
| | **మొత్తం** | **రు. 1000/-** |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,** యాప్రాల్,
ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218.**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/ 789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**